సంపుటము - I
సమావేశము- I
నెం. 2

వెల రూ.13-00
12 .జూన్, 2014
గురువారము,
(శక సం. 1936,
జ్యేష్ఠం - 22)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపములు

## అధికార నివేదిక

### విషయ సూచిక

| | | | పేజి నెం. |
|---|---|---|---|
| 1. | సభా కార్యక్రమం<br>సభ్యుల ప్రమాణ స్వీకారం | ... | 1 |
| 2. | సభా సమక్షమునందు పెట్టబడిన పత్రాలు | ... | 1 |
| 3. | ప్రకటనలు | ... | 1 |
| 4. | గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ | ... | 2 |

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| యాక్టింగ్ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ వి. నరసింహాచార్యులు |
| | | శ్రీమతి టి. సుశీల |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్ |
| | | శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్ |
| | | శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి ఎ. చంద్రభాగ |
| | | శ్రీమతి వి. ఎన్. ప్రసన్న కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

**(మొదటి సమావేశము : రెండవ రోజు)**

---

**గురువారం, జూన్ 12, 2014**

---

**(సభ ఉ. గం. 11.00 ని.లకు ప్రారంభమైంది గౌరవ యాక్టింగ్ ఛైర్మన్ అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

**సభా కార్యక్రమం**

మిస్టర్ ఛైర్మన్ 9వ తారీఖున ప్రమాణ స్వీకారం చేయని సభ్యులు ఇప్పుడు చేస్తారు.

**ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు**

శ్రీ కె. బలసాని లక్ష్మీనారాయణ

శ్రీ ఎం.ఎస్. ప్రభాకర రావు

Mr. CHAIRAMAN: Now we will take-up Item No. II.

**సభా సమక్షమునందు పెట్టబడిన పత్రాలు**

**PAPERS PLACED ON THE TABLE**

A copy of report on decisions of the Business Advisory Committee taken at its meeting held on 11th June, 2014.

**ప్రకటనలు**

**ANNOUNCEMENTS**

MR. CHAIRAMAN: There are two announcements

(1) I am to announce to the House that on 11th June, 2014, the Governor was pleased to Address the Members of both the Houses of Legislature. The true copy of the Address is laid on the Table of the House.

(2) I am to announce to the House that amendments to the Motion of Thanks to the Address by the Governor will be received by the Secretary to State Legislature by 4.00 P.M. on 12th June, 2014.

MR. CHAIRAMAN: Now we will take-up Item No. III.

## గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ

## MOTION ON ADDRESS BY THE GOVERNOR

MR. CHAIRAMAN: Now, I request Sri Paturi Sudhakar Reddy to move the Motion of thanks on Governor's Address, to be seconded by Sri K. Swamy Goud.

SRI PATURI SUDHAKAR REDDY (Medak, Nizamabad, Adilabad and Karimnagar) : Chairman Sir, I beg to move

"That the Members of Telangana Legislative Council assembled in this First Session are deeply grateful to the Governor for the Address which he has been pleased to deliver to the Members of Legislative Council on 11.06.2014."

MR. CHAIRMAN: Motion moved.

(Then the Address was mooted for discussions.)

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి: అధ్యక్షా, ఎలాగూ మనకు ఈ సెషన్‌లో క్వశ్చన్ అవర్ లేదు కాబట్టి ఒక స్పెషల్ మెన్షన్ చేస్తున్నాను. దయచేసి ఎలౌ చేయండి.

డాక్టర్ కె. నాగేశ్వర్ (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాదు) : అధ్యక్షా, సభలో ఆడియో/మైక్‌సిస్టమ్ సరిగా లేదు. మాకు మైకులు రావడం లేదు. వచ్చినా స్పష్టత కొరవడింది. సభ ఔన్నత్యాన్ని కాపాడవలసిన అవసరం ఉంది. నేడు టెక్నాలజీ ఎంతో డెవలప్ అయింది. దీన్ని ఇంప్రూవ్ చేయడం పెద్ద బ్రహ్మ విద్యేమీ కాదు.

మిస్టర్ ఛైర్మన్ : ఓ.కె., ఆడియో సిస్టంను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటాం.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి (అసెంబ్లీ): అధ్యక్షా, మన రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి చాలా కాలమైంది. ఫలితాలు వచ్చి కూడా ఈరోజుకి ఒక నెల అవుతోంది. అయితే వీటికి ఛైర్మన్ల ఎన్నికకు సంబంధించి చర్యలు చేపట్టడానికి ప్రభుత్వం ముందు కూడా ఒక ఇబ్బంది ఉన్న మాట వాస్తవం . ఇప్పుడున్న పరిస్థితులను చూస్తే 19వ తారీఖు వరకు కూడా దీనిపై నిర్ణయం జరిగే అవకాశం లేదని కొన్ని పత్రికలలో రావడం జరిగింది. గతనెల రోజులుగా కొన్ని వందల క్యాంపులు జరుపుతున్నాయి ఈ రాజకీయ పార్టీలు. వాళ్ల అవస్థని మీదృష్టికి,

ప్రభుత్వ దృష్టికి తీసుకరావాలనే నేను ఈ మెన్షన్ చేస్తున్నాను. ఇందులో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. ఈ క్యాంపులు ఎవ్వరికీ కొత్త కాదు. ఫలానా తేదీ లోపల ఈ విషయంపై క్లారిటీ వస్తుందని ప్రభుత్వం చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి రాశామనే స్టోరీలు వస్తున్నాయి పత్రికలలో . ఇప్పటికే నెల రోజులైంది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం - కేంద్ర ప్రభుత్వాన్ని అప్రోచ్ అయి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యమంత్రిగారు ఒక చక్కటి స్టేటుమెంటు ఇచ్చారు, స్వాగతిస్తున్నాం . జీరో టోలరెన్స్ ఫర్ కరప్షన్ అని చెప్పారు. లోకల్ బాడీస్‌లో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. దీన్ని అరికట్టే పరిస్థితి ప్రభుత్వం చేయి దాటిపోతోంది కాబట్టి వెంటనే ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని మీద్వారా ఒక డైరెక్షన్ ఇవ్వాలని కోరుతున్నాను.

శ్రీ పోట్ల నాగేశ్వరరావు (స్థానిక సంస్థలు): అధ్యక్షా, ఇప్పుడు గౌరవ సభ్యులు, పెద్దలు, అనుభవజ్ఞులైన యాదవరెడ్డి గారు లోకల్ బాడీస్ విషయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ అవస్థకి కారణం వ్యవస్థలోని లోపం . గత ప్రభుత్వాలు చేసిన ఎన్నికల విధానాల వల్ల ఈ పరిస్థితి వచ్చింది. స్వర్గీయ యన్.టి.రామారావుగారు తీసుకొచ్చిన ఎన్నికల విధానం ఒకసారి సభ దృష్టికి తీసుకరావలసిన అవసరం ఉంది. ఛైర్మన్ల ఎన్నిక నేరుగా జరిగితే ఈ రాజకీయ అవినీతికి తావుండదు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అంతకు ముందున్న పద్ధతి తొలగించి మార్పులు తీసుకొస్తే దాన్ని కొనసాగించడానికి తర్వాతి ప్రభుత్వాలు బాధ్యత తీసుకోలేదు. దాన్ని విస్మరించడం వల్లే మనం ఈరోజు ఈ అవస్థలు పడుతున్నాం . ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి చట్టాలను రెవ్యూ చేసుకుంటున్నట్లుగానే ఈ ఎన్నికల వ్యవస్థని కూడా రెవ్యూ చేసుకుని మార్పులు తీసుకరావలసిన అవసరం ప్రభుత్వానికి ఉందని ఒకసారి గుర్తు చేస్తున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, తెలంగాణా రాష్ట్రం దేశంలో నూతనంగా 29వ రాష్ట్రంగా ఏర్పడినందుకు మనమందరమూ కూడా గర్వపడుతున్నాం . ప్రప్రథమంగా తెలంగాణా రాష్ట్రంలో తొలి శాసన పరిషత్‌కి మీరు ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నాం, మా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం . అదే విధంగా తోటి సహచర శాసన పరిషత్ సభ్యులందరికీ కూడా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తెలంగాణా రాష్ట్రంలో జూబ్లీహాల్‌లో ఏర్పాటు చేసిన శాసన పరిషత్‌లో ఈరోజు కూర్చున్నందుకు మనందరికీ గర్వంగా ఉంది. ఎందుకంటే ఆరోజు ఉస్మాన్ అలీఖాన్ ఇక్కడ సభను నిర్వహించిన విషయం మీకు తెలుసు. అటువంటి సభలో మేము కూర్చునే అవకాశం లభించినందుకు మేమెంతో గర్వపడుతున్నాం. బాగా అనుభవం గడించిన, పరిపాలనలో రాటుదేలిన గవర్నర్ గారు నిన్నటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ మా ప్రభుత్వం యొక్క విధివిధానాలను

సుస్పష్టంగా తెలియజేయడం జరిగింది. గత 15 సంవత్సరాల నుంచి చేసిన పోరాటం ఫలితంగా 60 సంవత్సరాల కల సాకారమైనందున, తెలంగాణ రాష్ట్రం కావాలనే కాంక్ష నెరవేరిన సందర్భాన్ని పురస్కరించుకుని, ఎన్నో ఆటుపోట్లను, అవమానాలను భరించి, ఉద్యమనేతగా పేరు గాంచిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం యొక్క దశ, దిశ నిర్దేశం ఏవిధంగా ఉంటాయనే అంశాలను గవర్నర్ ప్రసంగంలో పొందుపరచినందుకు మేము ఎంతో గర్వపడుతున్నాం . గవర్నర్ గారు తన ప్రసంగంలో ఒక్కొక్క అంశానికి సంబంధించిన విధివిధానాలు ఎలా ఉంటాయో స్పష్టంగా పొందుపరచడం జరిగింది. ముఖ్యంగా ఈసభ కూర్పు చూస్తే - ఈరోజు మనం 33 మంది సభ్యులం ఉన్నాం. వీరిలో బాగా అనుభవం గడించిన పెద్దలు శ్రీ డి. శ్రీనివాస్‌గారు సభలో యల్ఓపిగా బాధ్యతలు నిర్వహిస్తున్నందుకు మేము గర్వపడుతున్నాం. అలాగే షబ్బీర్ అలీ గారు, పొంగులేటి సుధాకర్ రెడ్డిగారు కూడా అనుభవజ్ఞులైన సభ్యులు. వీరంతా ఉభయ సభలలో కూడా బాగా అనుభవం గడించిన వారే. వారంతా మాకు సలహాలు ఇస్తూ, దిశా నిర్దేశం చేస్తే అది రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడుతుందని భావిస్తున్నాం . తెలంగాణా రాష్ట్రంలో మొదటి ప్రభుత్వం కాబట్టి కొన్ని ఒడిదుడుకులుంటే ఉండవచ్చు, వాటిని సముదాయిస్తూ మాకు మంచి మార్గ నిర్దేశం చేస్తూ దేశంలో అత్యున్నతమైన రాష్ట్రంగా, ఈ సభా హుందాతనాన్ని నిలబెడుతూ, ఈ సభ గర్వపడేలా మాకు సూచనలు ఇస్తారని ఆశిస్తున్నాం. మంచి మేధావి అయిన ప్రొఫెసర్(డాక్టర్) కె. నాగేశ్వర్ గారు ఈ సభలో సభ్యులుగా ఉండడం మాకందరికీ గర్వకారణం. వారి సూచనల ప్రకారం ఈ సభను మీరు హుందాగా నిర్వహించి వన్నె తెస్తారని ఆశిస్తున్నాం. పెద్దలు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ సభ్యులు సుమారు 20సంవత్సరాల పాటు అధికారంలో ఉన్నారు. గవర్నర్ ప్రసంగం గురించి వారికి బాగు తెలుసు. ప్రభుత్వాన్ని ఏవిధంగా నిర్వహించాలనే విషయంలో వారు బాగా రాటుదేలారు. వాళ్లు కూడా మాకు సహాయ సహకారాలు అందించి, ఈ సభ సజావుగా నిర్వహించబడేలా మంచి సలహాలు ఇస్తారని ఆశిస్తున్నాం.

అధ్యక్షా, నిన్న గవర్నర్‌గారు ప్రసంగం చేస్తుంటే .. ఆయన ప్రప్రథమంగా తెలుగులో మాట్లాడుతుంటే, ఆయన మద్రాసీ అయినప్పటికీ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించి మమ్ములందరినీ కూడా అబ్బురపరచిన ఉదంతాన్ని చూశాం. సుస్పష్టంగా ఎక్కడ పదాన్ని ఒత్తాలో ఆవిధంగా ఒత్తి చూపించి నా ప్రభుత్వం అని గర్వపడేలా వారి ప్రసంగం కొనసాగింది. దీంట్లో ప్రధానంగా గత పదిహేను సంవత్సరాలనుంచి ఉద్యమాలలో ఎంతోమంది అసువులు బాసిన విషయాన్ని చూశాం కాబట్టి మన ప్రజలందరూ కూడా ఆశ పడుతున్నారు. వారికి

తెలంగాణా మీద ఎంత ప్రేమ ఉందంటే .. వారు ఏదో ఆశించి అసువులు బాయలేదు. కేవలం వచ్చే జనరేషన్, వాళ్ల భవిష్యత్తరాలకు, వాళ్ల పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలనే ఆవిధంగా ఆత్మ బలి దానాలు చేశారు. అసువులు బాసిన వారంతా తమ జీవితాలు గురించి ఆలోచించలేదు, వాళ్ల భవిష్యత్తు గురించి ఆలోచించలేదు, వాళ్ల తల్లిదండ్రుల మనోభావాలను కూడా పట్టించుకోకుండా త్యాగాలు చేసిన విషయాలను గుర్తు చేసినపుడు సభలో కన్నీరు పెట్టక తప్పలేదు. కాబట్టి ఆ విషయాన్ని గుర్తు చేసిన గవర్నర్ గారికి ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అమరులైన కుటుంబాలలో అర్హత గల ప్రతి కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వడమే గాకుండా ఆ కుటుంబాలలో అర్హులైన వారికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామనే మాట చెప్పారు.

10.15 ఉ. అదే విధంగా వారు వ్యవసాయ కుటుంబానికి చెందినట్లైతే వారికి భూమి కావాలంటే భూమి మరియు వారు భూమిని సాగు చేసుకోడానికి కావాల్సిన పెట్టుబడి కూడా ప్రభుత్వం ఇస్తుందనే మాట గవర్నర్‌గారి నోట విన్నందుకు ఎంతో గర్వపడుతున్నాను. కాబట్టి అమరుల యొక్క కుటుంబాలను ఆదుకొనే ప్రభుత్వం నాది అని చెప్పినప్పుడు మేము ఎంతో గర్వపడుతున్నామనే మాటను చెబుతున్నాను.

ఏ ప్రభుత్వమైనా కూడా సంక్షేమానికి పెద్దపీట వేసే ప్రభుత్వంగా ఉంటుంది. సంక్షేమం సరిగా జరిగితేనే అభివృద్ధి అనే మాటకు విలువ ఉంటుంది. మన రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడవాలనే సంకల్పంతో సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందనే విషయాన్ని గవర్నర్ గారి ప్రసంగంలో పొందుపరిచారు. సంక్షేమం అంటే ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీలే కాకుండా ఇతర బలహీన వర్గాల గురించి ఆలోచిస్తున్నామనే మాట గవర్నర్ గారి ప్రసంగంలో పొందుపరచడం జరిగింది. తెలంగాణ ప్రాంతాల్లోని గ్రామాల్లో నివసిస్తున్న దళితుల్లో ఎక్కువగా మాదిగ వారు ఉన్న విషయాన్ని మేము గమనించాం. ఎందుకంటే వారందరూ ఇప్పటికీ వ్యవసాయ కార్మికులుగా కొనసాగుతున్నారే తప్ప, ఎవ్వరికి కూడా వ్యవసాయం చేసుకునే అవకాశం లభించడం లేదు. కాబట్టి మాదిగలను ఉద్ధరించాలనే తలంపుతో అర్హత కలిగిన దళితులకు మూడు ఎకరాల భూమి ఇచ్చి వారిని ఆదుకుంటామనే మాటను గవర్నర్ గారి ప్రసంగంలో పొందుపరచడం జరిగింది. అలా ఎస్సీ కుటుంబాలను ఆదుకోవడం కొరకు ప్రత్యేకంగా 50వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడతామనే మాట గవర్నర్ గారి ప్రసంగంలో పొందుపరచడం జరిగింది. అందువల్ల ఈరోజు దళితులకు ఇది మా ప్రభుత్వమనే భరోసా కలుగుతుంది. అంతే కాకుండా ఎస్సీల పిల్లల కొరకు వసతి గృహాల

సౌకర్యం, వాటికి సరిపడా నిధులు కేటాయించడం జరుగుతుందనే మాట కూడా పొందుపరచడం జరిగింది. గతంలో ప్రభుత్వాల పని తీరును చూశాం. అలా కాకుండా కొత్త ఒరవడిలో ఉండేటువంటి ప్రభుత్వం కావాలని ప్రజలందరూ ఎదురుచూస్తున్నారు. చంద్రశేఖర్ రావుగారి నేతృత్వంలో ప్రభుత్వం ఎలావుంటుందో ప్రజలు గమనిస్తారు. వారి పరిపాలనా విధానం గవర్నరుగారి ప్రసంగంలో కొట్టొచ్చినట్టుగా కనబడింది. నా ప్రభుత్వం అవినీతి రహితమైన ప్రభుత్వం, లంచగొండి తనానికి ఆస్కారం లేనట్టి ప్రభుత్వం అనే మాట ఇచ్చారు. అందుకే ఆ అంశాలను కూడా గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపరిచి, బంధుప్రీతికి ఆస్కారం లేకుండా, ఆశ్రిత పక్షపాతం మచ్చుకు కూడా కనబడకుండా, అవినీతి రహితముగా ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నామనే మాటలు ప్రజలకు ఎంతో భరోసా కలిగిస్తాయి. ఈ విషయాలను వారి ప్రసంగంలో పొందుపరచడం ఎంతో ముదావహము. అదే విధంగా, ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడానికి, లంచగొండితనం లేకుండా పరిపాలన సాగిస్తామనే మాట, అదేవిధంగా రాజకీయ అవినీతిని కూడా మనం గతంలో చూస్తూ వచ్చాము. కానీ, అటువంటి ఆస్కారం మా ప్రభుత్వంలో ఉండదనే మాటలను కూడా గవర్నరుగారి ప్రసంగంలో పొందుపరచడం ఎంతో ముదావహమని ఈ సందర్భముగా తెలియచేస్తున్నాను. ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిధులు విడుదల చేసినప్పటికీ, ఆ నిధులు వారికి వినియోగింపబడకుండా దారిమళ్లించిన ఉదంతాలను గత ప్రభుత్వంలో మనం గమనించాం. కానీ ఈ ప్రభుత్వంలో మాత్రం, ఎస్సీల సంక్షేమం కొరకు రాగల 5 సంవత్సరాలలో రూ.50,000ల కోట్లను ఖర్చుచేయడమే కాకుండా, ఎస్సీ సబ్ ప్లాన్ కింద కేటాయింపబడే నిధులు ఒక్క పైసాకూడా పొల్లుపోకుండా, ఆ డబ్బులు వారికే వినియోగమయ్యేటట్లుగా చూస్తామని తెలియజేశారు. అదేవిధంగా, గిరిజనుల సంక్షేమం కొరకు, ప్రత్యేకంగా విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో 12% రిజర్వేషన్ కల్పిస్తామనే మాట గవర్నరుగారి ప్రసంగంలో పొందుపరచడం జరిగింది. ఆ రిజర్వేషన్లను తూ.చా తప్పకుండా అమలు పరుస్తామనే మాట చెప్పారు కాబట్టి, వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. అదేవిధంగా కైతి లంబాడీలకు, వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా కల్పిస్తామనే మాటను పొందుపరచడం జరిగింది. కేవలం ఐటిడిఏ ప్రాంతంలో ఉండే గిరిజనులకే కాకుండా మైదాన ప్రాంతంలో నివసించే గిరిజనులకు కూడా ఐటిడిఏలో ఉండే ప్రయోజనాలను కల్పిస్తామన్న మాట గవర్నరు గారి ప్రసంగంలో పొందుపరచడం జరిగింది. లంబాడి తండాలను మరియు ఆదివాసి గూడెంలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామనే మాటను చెప్పాం. గిరిజనుల కొరకు ప్రత్యేకంగా ఒక విశ్వ విద్యాలయం కావాలని కోరుతూ వచ్చాం. ఖమ్మం, వరంగల్, నల్గొండ మరియు ఆదిలాబాద్ ఈ నాలుగు జిల్లాలను కలిపి ఒక గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలనే ఆలోచనకు వచ్చినప్పటికీ అది

అమలుకు నోచుకోలేదు. కానీ గవర్నరుగారు మాత్రం మొదటి సంవత్సరంలోనే గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామనే మాట పొందుపరచడం, గిరిజనులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుందనే మాటను ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను.

బీసీ సంక్షేమం కొరకు ఎస్సీ, ఎస్టీలకు ఏ రకమైనటువంటి అవకాశాలున్నాయో, ఆ అవకాశాలన్నింటిని కూడా బీసీలకు కూడా వర్తించే విధంగా గవర్నరుగారి ప్రసంగంలో పొందుపరచడం జరిగింది. అంతేకాకుండా, పటిష్టవంతమైన యంత్రాంగం ద్వారా అందరికి వచ్చే ఐదు సంవత్సరాలల్లో 25వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి బీసీల సమగ్రాభివృద్ధి కొరకు కృషి చేస్తామనే మాట చెబుతున్నాం. బీసీలు అనగానే జనరల్‌గా అందరూ బీసీలనే మాట వస్తుంది. బీసీల్లో కూడా విభిన్నమైన జాతులున్నాయి. కాబట్టి వారిలో ప్రధానంగా ఈరోజు చేనేత కార్మికులకు సంబంధించి చెబుతున్నాం. వారిలో ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలున్నాయి. అందుకొరకు చేనేత కార్మికులకు రక్షణ కల్పించే విధంగా, వారి యొక్క చేనేత మగ్గాలు పునరుద్ధరణ కొరకు జరిగే కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నామనే మాట చెబుతున్నాం. అలాగే గీత కార్మికులను రక్షించాలనే సంకల్పంతో, వారికి రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో తప్పనిసరిగా మెరుగైనటువంటి కార్యక్రమాలు తీసుకుంటున్నాం. భవిష్యత్తులో ఎక్సైజ్ పాలసీ ఏవిధంగా ఉంటుందనే విషయాన్ని గవర్నరు గారి ప్రసంగంలో పొందుపరచడం జరిగింది. అలాగే గీత కార్మికులను, చేనేత కార్మికులను ఇతర వృత్తి కార్మికులైన వారు ఎవరైనా వారు గర్వపడేటట్లుగా, గ్రామాల్లో నివాసం ఉండేటట్టుగా అవకాశాలను మెరుగుపరిచేటువంటి రీతిగా గవర్నరు గారి ప్రసంగంలో పొందుపరచడం జరిగింది.

మైనారిటీల విషయంలో ఇప్పటికే మా ప్రభుత్వం ఏ మాటైతే అన్నదో ఆ మాట నిలబెట్టుకున్నాం. మైనారిటీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తామని చెప్పాం, ఈరోజు హైదరాబాద్‌కే షాన్ మా మహమూద్ అలీ సాబ్, రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి పదవి నిర్వహిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పదవే కాకుండా రెవెన్యూ శాఖను కూడా ఇచ్చి మాయొక్క ప్రభుత్వ లక్ష్యం ఏమిటనేది నిరూపించాం.

10.30 ఉ. ఈ తెలంగాణా రాష్ట్రంలో వీరూ, వారనేటటువంటి భావన లేదు అధ్యక్షా. దేశంలో ఉండేటటువంటి వివిధ జాతుల వారు, వివిధ మతాల వారు అందరికీ ఆశ్రయం ఇచ్చే ప్రాంతం ఈ తెలంగాణా ప్రాంతం. అటువంటి అంశాలను కూడా గవర్నరుగారి ప్రసంగంలో పొందుపరచడం వల్ల మా ఒళ్లు జలదరిస్తోంది. అందుకే ఈ ప్రభుత్వం మా తెలంగాణా ప్రభుత్వమయింది. గతంలో ఉన్న ప్రభుత్వాలకి, ఈ ప్రభుత్వానికి చాలా తేడా

ఉందని తమ ద్వారా మనవి తెలియచేస్తున్నాను. అందుకే 1927వ సంవత్సరంలో మహాత్మాగాంధీగారు ఆనాడు హైదరాబాదులో వివిధ కళాశాలలలో ప్రసంగిస్తూ, సహనం, సామరస్యంతో కూడిన సమ్మిళిత సంస్కృతి కలది ఈ తెలంగాణా ప్రాంతం అని కొనియాడారు. ఆవిధంగా కొనియాడదగిన ప్రసంగంలోని భాగం ఈనాడు మా గవర్నరుగారి ప్రసంగంలో రావడం మాకందరికీ గర్వకారణంగా ఉంది. అందుకొరకే ఇన్ని రంగాలలో ఆరితేరిన ఈ సంస్కృతిని కాపాడేవిధంగా మరియు ఈ రాష్ట్రాన్ని అందరూ గర్వపడేవిధంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తామని తమ ద్వారా తెలియజేస్తున్నాను. అదేవిధంగా, పింఛన్లకు సంబంధించి గతంలో ప్రభుత్వాలు, రూ.80లు ఇచ్చిన ప్రభుత్వాలు, రూ.20లు ఇచ్చిన ప్రభుత్వాలు కూడా ఉన్నాయి. కానీ, మా ప్రభుత్వం మాత్రం గవర్నరుగారి ప్రసంగంలో చెప్పినట్లుగా వికలాంగులకు...

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ (అసెంబ్లీ): అధ్యక్షా, సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి గవర్నరుగారి ప్రసంగం మీద ధన్యవాదాలు చెపుతూ అన్ని వర్గాల గురించి మాట్లాడుతూ, వారికి రిజర్వేషన్లు నాలుగు శాతం, 12 శాతం వరకూ పెరగాలని అన్నారు. అందుకు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కానీ, మొన్ననే ఎంసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈనెల 29వ తారీఖు లోపల కన్వీనర్ కోటాలో సీట్లన్నీ భర్తీ అయిపోతాయి. కాబట్టి, మీరు ఈ 12 శాతం, 4 శాతం విషయాన్ని మరచిపోయి, ఈనెల 29 లోపల ముఖ్యమంత్రిగారితో మాట్లాడి, మైనారిటీలకు, ఎస్టీల రిజర్వేషన్లకు సంబంధించిన కోటాలోని సీట్లు ఏ విధంగా భర్తీ చేయాలో ప్రభుత్వంతో ఆలోచించి, చర్చించి కన్వీనర్‌గారికి తెలియజేస్తే విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం దెబ్బతినకుండా ఉంటుంది. ఏది ఏమైనా విద్యార్థులకు ఒక విద్యాసంవత్సరం వృధా కాకుండా చూడండి.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : పెద్దలు, గౌరవ సభ్యులు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు గత ప్రభుత్వంలో పని చేసిన అనుభవం వారికి ఉంది కాబట్టే రిజర్వేషన్లకు సంబంధించిన అంశాన్ని తెలియజేశారు. ఇప్పటికే ఈ అంశం మీద మా ఉప ముఖ్యమంత్రి డా. టి.రాజయ్య చర్చించి నివేదికను కూడా ముఖ్యమంత్రిగారికి నివేదించడం జరిగింది. చిత్తశుద్ధితో ప్రభుత్వాన్ని నిర్వహించాలి కాబట్టి ఆ భావనతోనే ముందుకు వెడుతున్నాము.

శ్రీ బి. వెంకటేశ్వర్లు (అసెంబ్లీ): అధ్యక్షా, ఉప ముఖ్యమంత్రిగారు, గౌరవ మంత్రిగారు కూడా సభలో ఉన్నారు కాబట్టి, ప్రభుత్వం తరపు నుంచి జవాబు వచ్చినట్లు ఉంటుంది. ఈ నెల 29వ తారీఖు లోపు వాటిని అమలుచేస్తే తప్ప విద్యార్థులకు న్యాయం జరగదు. గౌరవ సభ్యులు ఈ విధంగా మాట్లాడుకుంటూ వెడితే ఎలా? ఇప్పుడు ఆయన ఎక్కడ

ఉన్నారంటే, ఇంద్రలోకంలో ఉన్నట్లుగా మాట్లాడుతున్నారు. నేను అనేది ఏమిటంటే, ప్రభుత్వం ఈ నెల 29లోపు ఏవిధమైన చర్యలు తీసుకోకపోతే, ఈ 12 శాతం రిజర్వేషన్లు గిరిజనులకు, మైనారిటీలకు అమలుకాకుండా పోతాయనేదే మా బాధ. అందుకొరకు ఇటువంటి అంశాలు వచ్చినప్పుడు స్పాంటేనియస్‌గా చెపితే తప్ప అవి రికార్డు కావు. మన సభలో మైనారిటీకి సంబంధించిన ఉప ముఖ్యమంత్రిగారు కూడా ఉన్నారు. వారు రిజర్వేషన్ల గురించి జవాబు చెపితే హుందాగా, గర్వంగా ఉంటుంది. గిరిజనులు చాలామంది ఉన్నారు. సీనియర్ నాయకులు చాలామంది ఉన్నారు కాబట్టి దీనిపై ప్రభుత్వం స్పందించవలసిందిగా నేను కోరుతున్నాను.

శ్రీ డి. శ్రీనివాస్ (అసెంబ్లీ): అధ్యక్షా, సుధాకర్ రెడ్డి గారు సర్వీసులో ఉన్నంతకాలం ఎఫిషియంట్ టీచర్‌గా ఉండి ఉండవచ్చు. నేను కాదనడం లేదు. నిన్నటి గవర్నర్‌గారి అడ్రస్‌లో, మీ మానిఫెస్టోలో ఏ విషయంపైనైనా క్లారిటీ గానీ, ఏదైనా అంశం స్పెసిఫిక్‌గా ఉందా అని తమ ద్వారా అడుగుతున్నాను. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి కూడా కొన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెడతామన్నారు. ఈ ఒక్క విషయమే కాదు ఏ ఒక్క విషయంలో గానీ ఏ రకమైన క్లారిటీ లేదు. దయచేసి మాకు ఉన్న అనుమానాలను ప్రభుత్వం ద్వారా క్లారిఫై చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అంశం చాలా వైటల్ ఇష్యూ. కనుక ఇవి అన్నీ జరగడమనేది గ్యారంటీ అన్నప్పుడు మైనారిటీ వెల్ఫేర్‌తో సహా హౌజ్‌లో కమిట్ అయ్యే విధంగా ఉండాలి.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి (బాన్సువాడ్) : అధ్యక్షా, మొదటిసారి శాసన మండలిలో మాట్లాడే అవకాశం నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెపుతున్నాను. ఈ సభలో సభ్యులు పలు అంశాలకు సంబంధించి రకరకాలుగా క్లారిఫికేషన్స్ అడిగారు. ఆ అంశాలకు సంబంధించి ప్రభుత్వం తరఫున వివరణ ఇవ్వడం జరుగుతుంది. అందులో ఎటువంటి అనుమానాలకు తావు లేదు. గవర్నరుగారి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే కార్యక్రమంలో గౌరవ సభ్యులు అన్ని విషయాలను చర్చించిన వాటికి సంబంధించిన వివరణలను మరియు ఏఏ పథకాలకు ఏ రకంగా ఖర్చుపెట్టబోతున్నామనేది ప్రభుత్వం తరఫు నుంచి పూర్తి వివరణ ఇవ్వడం జరుగుతుంది. అందుకు సభ్యులు ఏ విధంగానూ అనుమానపడవలసినవసరం లేదు. టిఆర్ఎస్ పార్టీ తరఫున మ్యానిఫెస్టోలో పొందుపరచిన అంశాలకు సంబంధించిన విధివిధానాలవరకే అందులో చెప్పడం జరిగింది. తరవాత మిగతా అంశాలకు సంబంధించి తప్పకుండా సభలో వివరిస్తామని తమ ద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. రిజర్వేషన్ల విషయమై పక్కరాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలు ఏ విధంగా చేశాయో, ఆ

విధంగానే భారత ప్రభుత్వంతో మాట్లాడి వాటిని చిత్తశుద్ధితో అమలు చేయడం జరుగుతుందని తమ ద్వారా తెలియజేస్తున్నాను. ఎస్సీఎస్టీలకు, మైనారిటీలకు అనుకూలంగానే ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని నేను గౌరవ సభ్యులకు తమ ద్వారా మనవి చేస్తున్నాను. ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీలకు అధికంగానే ఖర్చవుతున్నది కాబట్టి, పై అంశాలన్నింటినీ కూడా ముఖ్యమంత్రిగారు మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకువెడతాము. అలాగే ఎలక్షన్ కమీషన్ కూడా త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేసి జిల్లా పరిషత్, మండల పరిషత్తులకు ఎన్నికలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

డా. కె. నాగేశ్వర్ : అధ్యక్షా, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలవలె మన రాష్ట్రాన్ని కూడా చేస్తామని మంత్రిగారు చెబుతున్నారు. కానీ, పెద్దలు మంత్రిగారికి ఈ విషయం తెలిసే ఉంటుంది. తమిళనాడు రాష్ట్రంలో ఈ రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో చేర్చడం జరిగింది. కానీ, 9వ షెడ్యూలులో పెట్టినా కూడా అది భారత రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధమైనది కాబట్టి ఆ అంశానికి సంబంధించి న్యాయ సమీక్ష చేస్తామని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. తమిళనాడు రాష్ట్రంలో చేసినప్పుడు రాజ్యాంగ పొజిషన్ ఏమిటంటే - 9వ షెడ్యూలులో ఏ చట్టాన్ని అయినా చేరిస్తే దాని న్యాయసమీకోకు అవకాశం లేదు. సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన తరువాత తిరిగి 9వ షెడ్యూలులో పెట్టడం ఎంతమేరకు ప్రయోజనకరం. కాబట్టి, ఆ తీర్పు ప్రకారం తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలవలె చేయడానికి వీలు లేదు. ఎందుకంటే, 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు చేయడానికి అవకాశం లేదు. ముస్లిములందరికీ రిజర్వేషన్లు వర్తించాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పలేదు. ముస్లింలలోని వెనుకబాటుతనాన్ని గుర్తించి రిజర్వేషన్లు ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. మతం కారణంగా రిజర్వేషన్లు ఇవ్వకూడదు, మతం కారణంగా రిజర్వేషన్లు కోల్పోకూడదు. అందువల్ల ముస్లీంలలో వెనుకబాటుతనాన్ని గుర్తించకపోతే చాలా సమస్యలు వస్తాయి. గతంలో కోర్టు బిసి కమీషన్ ద్వారా నిర్దిష్టంగా గుర్తించి తీసుకురావాలని చెప్పిన అనుభవం కూడా ఉంది. అందువల్ల, మంత్రిగారు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలవలె ఈ తెలంగాణా రాష్ట్రాన్ని చేస్తామంటే ఏ విధంగా చేస్తారు? రాజ్యాంగ పరమైన అంశాలకు సంబంధించి ఏ విధంగా చేస్తారు? 29వ తారీఖు లోపల వెనుకబడిన విద్యార్థులకు సంబంధించి ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటారో సభలో చెప్పాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ : అధ్యక్షా, మేము ఈ విషయమై కేంద్రప్రభుత్వానికి కూడా వ్రాస్తాము. పెద్దలు డా. కె. నాగేశ్వర్ చెప్పినట్లు 25 ఏప్రిల్, 2010లో సుప్రీంకోర్టు ఒక తీర్పు ఇస్తూ, ఆంధ్రప్రదేశ్ జడ్జిమెంట్‌లో ఐదు శాతం, నాలుగు శాతానికి తగ్గించుకున్నప్పుడు

ఏమన్నారనేది మేము కూడా ఉదాహరణలు ఇచ్చాము. తమిళనాడు రాష్ట్రంలో 65 శాతం ఉంది కాబట్టి, దీనిని కన్సిడర్ చేయమని చెప్పి మా కేసుతో వారి కేసును కూడా రీ-ఓపెన్ చేయించారు. తమిళనాడు రాష్ట్రంలో 9వ షెడ్యూల్‌లో తీసుకున్న అంశాన్ని కూడా మేము గుర్తు చేస్తామని అన్నాము. వీటికి సంబంధించి సుప్రీంకోర్టులో, హైకోర్టులో ఛాలెంజ్ చేయకూడదని చెపితే, వాటిని కూడా ఛాలెంజ్ చేశాము. దీనికి సంబంధించి పార్లమెంటులో బిల్లు పాస్ కావాలంటే సుమారు 2/3 మెజారిటీ కావాలి. తెలంగాణా రాష్ట్రానికి సంబంధించి బిల్లు పాస్ చేసేందుకు ఎన్ని ఇబ్బందులు ఎదురయ్యాయో అందరికీ తెలిసిందే. మైనారిటీ సభ్యులకు సంబంధించి బిజేపి ప్రభుత్వంతో కలిపి మెజారిటీ తీసుకురావడం చాలా గొప్ప విషయం. నేను ఎప్పుడు మిమ్మల్ని నిరాశ చేయడం లేదు. మీరు ప్రయత్నం చెయ్యండి. ఏ ప్రయత్నమైనా ఈ నెల 29వ తారీఖు లోపల చేసినట్లయితే, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేసినవారవుతారని వారి సంక్షేమానికి పాటుపడినవారవుతారని మనవిచేస్తున్నాను.

SRI SYED AMINUL HASAN JAFRI (Local Authorities): Chairman Sir, we welcome the announcement of the Telangana Rashtra Samithi Government to raise the reservation for minorities to 12%. This is fine. But, at the same time, we would like to advise this present Telangana Government on the issue of raising the factum of reservation to 12% for Muslim minorities. This is because the 4% reservation for the socially and educationally backward Muslim is under the Backward ‘C’ community quota will provided in the State on the directions of the Hon’ble Supreme Court pending on the Judgment in the SLP on the same.

We would like to urge the Government to order for comprehensive survey with regard to social-economic and educationally backward Muslims in all the Districts across the State of Telangana through a renowned Research Institutions such as Tata Institute of Social Sciences, Centre for Economic and Social Studies, Administrative Staff College in India, Centre for Study of Developing Societies. Based on the empirical evidence of the Survey and after getting the issue examined thoroughly by the State Backward Class Commission, which has to be set up under the A.P. Re-organization Act. The quota can be enhanced for Muslims after plugging any legal obstacles.

10.45 ఉ. శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డి: అధ్యక్షా, గవర్నర్‌గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడే అవకాశం ప్రభుత్వపరంగా మాకు వచ్చింది. ప్రతిపక్ష సభ్యులెవ్వరైనా మీకు కూడా ఆ అవకాశం వస్తుంది. అందువల్లనే అన్ని అంశాలనూ మేము ప్రస్తావిస్తున్నాము.

నిదానమే ప్రధానం. నిదానంగా మా ప్రభుత్వాన్ని నడిచే విధంగా చూడండి. అట్లయితేనే ఫలితాలను అనుభవించటానికి అవకాశముంటుంది.

ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న అనేకమంది వికలాంగులు ప్రత్యేకంగా నల్గొండ జిల్లాలో ఉన్న విషయం మనందరికీ బాగా తెలుసు. కొన్ని కుటుంబాలను పరిశీలిస్తే వికలాంగులే స్వయంగా వారి కుటుంబాన్ని పోషించే పరిస్థితి ఉన్నది. గత ప్రభుత్వాలు ఇచ్చిన రూ. 200 లు లేదా రూ. 1000 లతో సరిపోవడం లేదని భావించి, నేడు వికలాంగులకు నెలకు రూ. 1500 లు చెల్లించాలనే నిర్ణయం తీసుకోవడం గవర్నర్‌గారి ప్రసంగంలో ఉంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కొడుకులు, బిడ్డలు సరిగా చూడకపోవడం వల్ల వారు నానా అవస్థలు, ఇబ్బందులను ఎదుర్కోవడం మనం అనేక వార్తాపత్రికలలో రోజూ చదవడం జరుగుతోంది. వారిని కూడా ఆదుకునే ప్రభుత్వం కాబట్టి గవర్నర్‌గారు ప్రత్యేకమైన శ్రద్ధతో వారికి నెలకు రూ. 1000 లు ఇప్పించే విషయాన్ని వారి ప్రసంగంలో విని చాలా సంతోషిస్తున్నామని తెలియజేస్తున్నాను. కేవలం వికలాంగులు, వృద్ధులే కాక అనాథ మహిళలంతా కూడా నేడు సమాజంలో చాలా దీనావస్థలో ఉన్నారు. వారికి కూడా పెన్షన్ సదుపాయాన్ని కల్పిస్తామనే విషయం గవర్నర్‌గారి ప్రసంగంలో ఉంది. కాబట్టి గౌరవసభ్యులందరూ ఈ విషయాలను గమనించవలసిందిగా తమరిద్వారా కోరుతున్నాను.

ప్రత్యేకంగా నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఉన్న బీడీకార్మికులను ఆదుకోవడం కోసం నెలకు రూ. 1000 లు భత్యాన్ని కూడా చెల్లిస్తామనే విషయాన్ని గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం జరిగింది. పేదలకు ఇళ్లు ఇచ్చే విషయంలో మేము ఒక మండలంలో సర్వే చేస్తే సుమారు 400 మంది గృహాలు లేని వారున్నారు. గృహాలులేని ప్రతి బీద కుటుంబానికి రూ. 3 లక్షలతో రెండు పడకగదులు, హాలు, వంటగది, బాత్‌రూమ్ మరియు టాయిలెట్‌లతో కూడిన ఒక మంచి ఇల్లును నిర్మించి ఇస్తామనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

పాఠశాల విద్యా వ్యవస్థ విషయంలో, గత పది సంవత్సరాలకు సంబంధించిన గణాంకాలను పరిశీలిస్తే, బీదలకు విద్య అందుబాటులో లేకపోవడం వల్ల ఎవరైనా గానీ విద్యను కొనుక్కొనే పరిస్థితి మన రాష్ట్ర విద్యావ్యవస్థలో నెలకొని ఉంది. ఆ విధంగా కాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో కె.జి. నుంచి పి.జి. వరకూ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించే వ్యవస్థను ఏర్పాటు చేస్తామనే విషయం గవర్నర్ ప్రసంగంలో పొందుపర్చబడింది. గత ప్రభుత్వంలో శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డిగారు పేదలకు సి.బి.ఎస్.ఈ. సిలబస్ ద్వారా

ఆంగ్లమాధ్యమంలో విద్యను అందిస్తామని చెప్పినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో తప్పకుండా పేదలకు సి.బి.ఎస్.ఈ. సిలబస్ ద్వారా ఆంగ్లమాధ్యమంలో విద్యను అందిస్తామనే మాటకు కట్టుబడి ఉంటామనే విషయం గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం జరిగింది.

ప్రతి గ్రామంలో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేవడానికి జర్నలిస్టులు ప్రధాన భూమికను పోషించడం మనందరికీ తెలుసు. అందుకొరకే జర్నలిస్టులు పోషించిన పాత్రకు అనుగుణంగా వారిని ఆదుకోవడానికి రూ. 10 కోట్ల కార్పస్‌తో సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తున్నామనే విషయం కూడా గవర్నర్‌గారి ప్రసంగంలో ఉంది. దీంతో జర్నలిస్టులంతా నేడు ఎంతో సంతోషంతో ఉన్నారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు వారు ఎన్ని సహాయసహకారాలు అందించినప్పటికీ ఆయా ప్రభుత్వాలు వారికోసం ఏనాడూ ఆలోచించలేదు. నూతనంగా వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేడు రూ. 10 కోట్ల కార్పస్‌తో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడం ఎంతో ముదావహమైన విషయమని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

అదేవిధంగా, అడ్వకేట్లంతా కూడా తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములవుతూ ప్రధానభూమికను నిర్వహిస్తూ వచ్చారు. కాబట్టి వారి సంక్షేమం కోసం కూడా రూ. 100 కోట్ల కార్పస్‌తో సంక్షేమ నిధిని ఏర్పాటుచేస్తామనే విషయం కూడా గౌరవ గవర్నర్‌గారి ప్రసంగంలో ఉంది. వీరు మాత్రమేకాక, ఆర్.టి.సి. కార్మికులు, సింగరేణి కార్మికులు, నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులు సంక్షేమ పథకాలద్వారా లబ్ది పొందుతారనే విషయాన్ని కూడా గౌరవ గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం ఎంతో ముదావహమైన విషయమని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

ఆనాటినుంచి ఈనాటి వరకూ "తెలంగాణనే శరణ్యం లేకపోతే అరణ్యం" అని భావించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రసాధన కోసం అహర్నిశలు కృషి చేసిన సంఘం "తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం" అని చెప్పవచ్చు. పెద్దలు శ్రీ ఆమోస్‌గారు ఆనాడు అధ్యక్షులుగా ఉండి బాధ్యతలు నిర్వహించి ఆనాటినుంచి ఈనాటి వరకూ మొక్కవోని ధైర్యంతో తెలంగాణ రాష్ట్రంకోసం అహర్నిశలు కృషిచేయడం జరిగింది. వారితోపాటు అనేకమంది మహనీయులు, ఉద్యోగులు కూడా తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం కోసం అహర్నిశలు కృషిచేయడం జరిగింది. వారందరి కృషివల్ల కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది కాబట్టి

ఉద్యోగుల సంక్షేమం ప్రధానమైన బాధ్యతగా భావించి వారికి ఒక స్పెషల్ ఇంక్రిమెంటు ఇస్తామనే విషయాన్ని గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం ఎంతో ముదావహమైన విషయమని కూడా ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అదనంగా ఒక వార్షిక ఇంక్రిమెంటు మంజూరవడం వల్ల ఉద్యోగులంతా కూడా నేడు చాలా సంతోషంగా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. మెడికల్ రీఇంబర్స్‌మెంట్‌కోసం ఉద్యోగులు గతంలో అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చేది. ఒక ఉద్యోగి సుమారు రూ. 1 లక్షలు వైద్యంకోసం ఖర్చు చేస్తే, దానిని తిరిగి పొందాలంటే సుమారు రూ. 20 వేలు లంచంగా ఖర్చు చేస్తే తప్ప ఆ రూ.1 లక్షలు తిరిగి వచ్చే పరిస్థితి లేదు. మెడికల్ రీఇంబర్స్‌మెంట్ విషయంలో అవినీతిమయమైన విధానం ఉంటూ వచ్చింది. దానికి ఆస్కారం లేకుండా ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులు జారీ చేసే విధానాన్ని గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం ఎంతో న్యాయసమ్మతమైన విషయాన్ని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. మాది ఉద్యోగులను నమ్ముకున్న ప్రభుత్వం కాబట్టి ఉద్యోగులు, ప్రజాప్రతినిధులంతా స్నేహపూర్వకమైన వాతావరణంలో కొనసాగాలని అటువంటి ప్రభుత్వం కావాలని కాంక్షిస్తూ వచ్చాము. నేడు స్వయంగా ఉద్యోగులే ఇది మా ప్రభుత్వం అనే రీతిలో రోజుకు ఒక గంట అదనంగా పనిచేస్తామని ముందుకు వచ్చిన ఉద్యోగులను సంరక్షించడానికి మా ప్రభుత్వం ముందుంటుందనే విషయాన్ని కూడా చెబుతున్నాము. స్నేహపూర్వకమైన వాతావరణంలో ప్రభుత్వాన్ని నిర్వహిస్తామనే విషయాన్ని కూడా గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం జరిగింది.

మన సమాజంలో నేడు 50 శాతం మంది మహిళలున్నారు. వారి సంరక్షణ కొరకు ప్రత్యేకమైన కార్యక్రమాలు చేస్తున్నాము. మన నిజామాబాదు జిల్లాకు చెందిన బిడ్డ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడం చూసి మనమంతా చాలా గర్వపడుతున్నాము. అన్ని రంగాల్లో రాణించే శక్తియుక్తులు నేడు మహిళలకున్నాయి కాబట్టి వారిని ప్రోత్సహించడంలో మన రాష్ట్రప్రభుత్వం ముందుంటుందనే విషయం గౌరవ గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం జరిగింది. ఐ.టి.రంగంలో పనిచేస్తోన్న మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో సైబరాబాదు మరియు హైదరాబాదు కమిషనరేట్ పరిధిలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండే విధంగా పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులు, పటిష్టమైన చర్యలు తీసుకునే విషయాలు గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం జరిగింది.

వ్యవసాయకార్మికులంతా నేడు ఇది మా ప్రభుత్వం అనే రీతిగా ఉన్నారు. వ్యవసాయాధారిత అనుబంధ రంగాలను కూడా ప్రోత్సహిస్తామనే విషయాన్ని కూడా చెప్పడం జరిగింది. నేటి ప్రధాన వృత్తి అయిన వ్యవసాయం, విద్యుత్తు రంగాల సత్వర పురోభివృద్ధికి అత్యంత శ్రద్ధ వహిస్తామనే విషయం కూడా గౌరవ గవర్నర్‌గారి ప్రసంగంలో ఉంది.

రైతులకు రుణమాఫీ విషయంలో కూడా ఎవరికీ ఎటువంటి సందేహాలు ఉండవలసిన అవసరం లేదు. గౌరవ వ్యవసాయ మంత్రిగారు రుణమాఫీ విషయంలో స్పష్టత ఇచ్చారు కాబట్టి మళ్లీ దానిని ప్రస్తావించవద్దని కూడా గౌరవసభ్యులకు మనవిచేస్తున్నాను. రూ. 1 లక్షలు లోపు ఉన్న రుణాలన్నింటినీ కూడా మాఫీ చేయడానికి కట్టుబడి ఉంటామనే విషయాన్ని కూడా గౌరవ గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం జరిగింది. వ్యవసాయ ట్రాక్టర్లు, ట్రాలీలకు పన్ను నుంచి మినహాయింపుని ఇస్తాము. మహత్తర పరిశోధన అభివృద్ధితో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తామనే విషయాన్ని గౌరవ సభ్యులు నాగేశ్వరరావుగారు గమనించాలి. ఎందుకంటే, మండల కేంద్రంలో ఒక యూనిట్‌ను పెట్టి వారి భూమికి ఏ రకమైన అవకాశముంది, వారి భూమిని పరిశోధన చేసి ఎటువంటి విత్తనాలు అక్కడ వేయాలి, ఏరకమైన ఎరువులను వాడాలనే విషయంలో రైతులకు సరైన సూచనలు ఇచ్చే యంత్రాంగాన్ని మండలం యూనిట్ వారిగా ఏర్పాటు చేస్తున్నాము. వ్యవసాయదారులకు నష్టం వాటిల్లకుండా వారికి అత్యధిక దిగుబడి వచ్చే విధంగా చర్యలు తీసుకునే వ్యవస్థ నేటి వ్యవసాయరంగంలో ఉంటుందనే విషయాన్ని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను. ఎవరూ ఊహించిన రీతిగా చెరకు పంటను అభివృద్ధి పరిచే పరిశోధనా కేంద్రాన్ని నిజామాబాదు జిల్లాలో ఏర్పాటు చేస్తున్నాము. పసుపు పండించే రైతులకు ఎటువంటి అవకాశం నేటి వరకూ లేకుండా పోయింది. గుంటూరు జిల్లాలో పొగాకు పండించే రైతులకు పొగాకు బోర్డు ఉంది. తెలంగాణ జిల్లాల్లో పసుపు పండించే రైతులకు ఎటువంటి బోర్డు లేకుండా పోయింది. ప్రత్యేకంగా పసుపు పండించే రైతులు కరీంనగర్ మరియు నిజామాబాద్ జిల్లాల్లో ఉన్నారు. వారిని ఆదుకోవడం కోసం ప్రత్యేకమైన పసుపు పరిశోధనా కేంద్రాన్ని మోర్తాడ్ అనే గ్రామంలో ఏర్పాటుచేస్తున్నామనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

నేడు తెలంగాణ ప్రాంతం విత్తనాల సరఫరాకు అనువైన ప్రాంతంగా గుర్తింపు చెందింది. తెలంగాణ ప్రాంతంలోని 9 జిల్లాలో ఉన్న భూమిని పరిశోధన చేస్తే ఇక్కడున్న భూమి అంతా సారవంతమైన భూమిగా తెలిసింది. ఈ విషయంలో మనమంతా గర్వపడాలి. అటువంటి భూమిలో సరైన విత్తనాలతో పంటను పండించాలనే ఉద్దేశ్యంతో నేడు మనమంతా గర్వపడే విధంగా భారత విత్తన భాండాగారాన్ని తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఇది మనకెంతో గర్వకారణమనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. రైతులను ఆదుకోవడానికి వారు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ఆధునిక పరికరాల కొనుగోలులో సబ్సిడీని ఇస్తున్నాము. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నివారిస్తున్నాము. అంతేగాక, గ్రీన్‌హస్ ఫార్మింగ్‌కు కూడా తగినంత సబ్సిడీని ఇచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

మా ప్రభుత్వమనే విషయాన్ని గౌరవ గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చిన విషయాన్ని ఈ సందర్భంగా గౌరవసభ్యులకు గుర్తుకుతెస్తున్నాను. అంతేగాక, అగ్రికల్చర్ అలైడ్ పరిశ్రమలు ఏవెతై ఉన్నాయో, ఉదాహరణకు కోళ్ల పరిశ్రమకు దేశంలో ఎక్కడా లేని విధంగా మూడింట ఒక వంతు తెలంగాణ రాష్ట్రంలో ఉంది. ఆ కోళ్ల పరిశ్రమను ప్రోత్సహిస్తామనే విషయం కూడా గౌరవ గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం జరిగింది. పారిశ్రామికవేత్తలకు, రైతులకు ప్రోత్సాహకాలు కల్పించే పూ। మా ప్రభుత్వానిదని ఈరోజు గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చడం సరైన విషయమని మనవిచేస్తున్నాను.

**11.00 ఉ.** అధ్యక్షా, భారీ నీటి పారుదల సౌకర్యం గురించి మనందరికీ తెలుసు, మీరు ఇన్ని సంవత్సరాలు పరిపాలన చేసినా గ్రావిటీ ద్వారా నీటిని ఎలా పారించాలనే విషయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోయారు. జూరాల నుండి పాకాల దాకా గ్రావిటీ ద్వారా నీటిని ఏ విధంగా అందించవచ్చనే విషయాని గవర్నర్ గారి ప్రసంగంలో చెప్పించడం జరిగింది. తద్వారా మహబూబ్‌నగర్, నల్గొండ మరియు వరంగల్ జిల్లాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించడం జరుగుతుంది. ఒక్కొక్క నియోజక వర్గంలో లక్ష ఎకరాలకు నీటి పారుదల సదుపాయం కల్పించే విధంగా ప్రాజెక్టులను నిర్మిస్తామనే విషయాన్ని తెలియజేస్తున్నాం. అలాగే పెండింగ్ ప్రాజెక్ట్‌లను కూడా పూర్తి చేస్తాం. ఆ విధంగా తెలంగాణ ప్రాంతంలో గోదావరి, కృష్ణా నదులు ప్రవహిస్తున్నాయి కాబట్టి ఆ బేసిన్‌లోని నీరు వినియోగపడే విధంగా ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని తెలియజేస్తున్నాం. ఒకవైపేమో జూరాల నుండి పాకాల వరకు ఒక ప్రాజెక్టు అవుతుంది, అటువైపు పాలమూరు ప్రాజెక్టు అవుతుంది. ఇంకొక వైపు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేస్తాం. తద్వారా తెలంగాణ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుంది. అలాగే గొలుసుకట్టు చెరువులు, కుంటలు, ఆన కట్టలను పునరుద్ధరించి సాగునీటి వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పు తీసుకువస్తామని తెలియజేస్తున్నాం.

విద్యుత్ రంగాన్ని తీసుకుంటే, మొదటి మూడు సంవత్సరాలు కొంత కష్టంగా ఉంటుందని మేము మొదటి నుండీ చెబుతూ వస్తున్నాం. థర్మల్ విద్యుత్ స్థాపిత సామర్థ్యం **2283**మెగావాట్లు, జల విద్యుత్ యొక్క స్థాపిత సామర్థ్యం **2157** మెగావాట్లు. అంతే కాకుండా, విద్యుత్‌ను మెరుగుపరచడానికి ఎన్‌టిపిసిచే **4000** మెగావాట్ల విద్యుత్తు ప్లాంటును ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. దానికి కావలసినటువంటి రూం, నీరు ఇస్తామని చెబుతున్నాం. జెన్కో ద్వారా **6,000** మెగావాట్లను ఉత్పత్తి చేయాలని మేము యోచిస్తున్నాం. అయినప్పటికీ విద్యుచ్ఛక్తి కష్టాలు ఇంకా ఉంటాయి, ప్రజలకు ఎటువంటి

ఇబ్బంది కలుగకుండా, రైతులను ఆదుకొనే ప్రభుత్వం అనే విధంగా ఛత్తీస్‌ఘడ్ నుండి విద్యుత్తును కొనుగోలు చేసి అవసరమైన గ్రిడ్ లైన్లు, పంపిణీ నెట్‌వర్క్‌లను మేము ఏర్పాటు చేస్తామని తెలిపాం.

ఆరోగ్య విషయంలో గతంలో 108, 104 విషయాలు ఏలా ఉన్నాయో తెలియదు కాని ఇప్పుడు కొద్దిగా అలసత్వం ఏర్పడ్డది. దానిని పటిష్ట పరచడానికి ప్రజలందరికీ ఆరోగ్యం అందే విధంగా చూస్తామని మనవి చేస్తున్నాను. నిమ్స్ తరహాలో జిల్లాకు ఒక్కొక్క ఆసుపత్రి నిర్మిస్తామని తెలియజేస్తున్నాను. ఎక్కడెక్కడ అయితే మెటర్నిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సి వస్తుందో, అక్కడక్కడ మెటర్నిటి ఆసుపత్రి ఏర్పాటు చేస్తాం. ఆ విధంగా గవర్నర్ ప్రసంగం సాగుతూ ఉంటే నాకు చాలా సంతోషం కలిగింది.

పారిశ్రామిక రంగాన్ని తీసుకుంటే, పారిశ్రామిక రంగంలో ఒక విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలని యోచిస్తున్నాం. పారిశ్రామిక విధానాన్ని సింగిల్ విండో క్లియరెన్స్ పద్ధతి ద్వారా ఎవరైనా పారిశ్రామిక వేత్తలు వస్తే, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒక సెల్ ఏర్పాటు చేసి ఆ సెల్ ద్వారా సింగిల్ విండో క్లియరెన్స్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. కాబట్టి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే ప్రభుత్వం ఏది అంటే, తెలంగాణ ప్రభుత్వమే అనే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేస్తాము. అవినీతికి ఆస్కారం లేకుండా సామర్థ్యత గల పెట్టుబడిదారులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా రాబోయే ప్రాజెక్టులకు త్వరితగతిన క్లియరెన్స్ ఇవ్వడానికి ముఖ్యమంత్రి కార్యాలయానికి అనుబంధంగా ఒక ప్రత్యేక చేజింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసి వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామనే విషయాన్ని మనవిచేస్తున్నాను.

చేనేత పరిశ్రమలను తీసుకుంటే, వరంగల్, సిరిసిల్లను అభివృద్ధి చెందే చేనేత పారిశ్రామిక కేంద్రాలుగా మార్చడానికి, సదరు స్థలాలలో నూలు, పట్టు కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. అలాగే హైదరాబాద్, వరంగల్ మధ్య కూడా ఒక పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసి తద్వారా పారిశ్రామిక వేత్తలకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తామని తెలియజేశాం. అంతే కాకుండా కాజీపేట వద్ద రైల్వే కోచ్ ఫ్యాక్టరీనొకదానిని ఏర్పాటు చేస్తామని ఊరిస్తూ వచ్చారు, కాని అది జరగలేదు. కానీ మా ప్రభుత్వం ఆ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికని రైల్వే మంత్రిత్వ శాఖతో సంప్రదిస్తున్నాం.

హైదరాబాద్ నగరంలో మురికి వాడలను తీసేసి, సరైన రీతిగా గ్రేటర్ హైదరాబాద్ అనే రితిలో హైదరాబాద్‌ను బ్రాండ్ హైదరాబాద్‌గా నిలబెడదామని తెలియజేశాం. కాబట్టి హైదరాబాద్ నగరాన్ని గంగా-జమున తెహజీబ్ నగర్గం అనే రీతిగా నగరాన్ని తీర్చిదిద్దుతామని చెప్పాం. జాతి, మత భేదాలు లేకుండా ఇతర దేశస్తులు కూడా హైదరాబాద్‌కు వెళ్లాలనే రీతిగా, అందరికీ అనువుగా ఉండే విధంగా తీర్చిదిద్దుతామని తెలియజేస్తున్నాను. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల నీరు హైదరాబాద్‌కు సరిపోవడం లేదు కాబట్టి కృష్ణా, గోదావరి నదుల నుండి నీటిని తెప్పించి చక్కగా నీటి సౌకర్యం కల్పిస్తామని తెలియజేశాం. అందరు అబ్బురపడే విధంగా హైదరాబాద్‌ను మెల్‌బోర్న్, వియన్నా లాంటి దేశాలుగా, ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన నివాసిత నగరాలలో ఒకటిగా తీర్చిదిద్దుతామని తెలియజేశాం.

హైదరాబాదులో ప్రతిష్టాత్మక ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్‌వెస్ట్‌మెంట్ రీజియన్(ఐటిఐఆర్) అమలుతో తెలంగాణలో ఐటి రంగాన్ని మార్పు చేయడమవుతుందని చెప్పాం.

(అంతరాయం)

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి (అసెంబ్లీ): అధ్యక్షా, అందరికీ తెలుసు. నిజాం సుగర్ ఫ్యాక్టరీపైన హౌజ్ కమిటీ ఇచ్చిన నివేదికపై అందరూ కలిసి యుద్ధం చేయడం జరిగింది. దానిని తక్షణమే ఇంప్లిమెంట్ చేసి, ఆ అమ్మిన వారి దగ్గర నుంచి తీసుకొని మళ్లీ ఆ యొక్క సుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తారా? అని ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : సుధాకర్‌రెడ్డిగారూ, మీరు కంప్లీట్ చేయండి.

శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డి: ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్‌వెస్ట్‌మెంట్ రీజియన్‌గా హైదరాబాదు నగరం ఏర్పడుతుంది కాబట్టి రాబోయే పది సంవత్సరాలలో ప్రత్యక్షంగా లేక పరోక్షంగా సుమారు 52 లక్షల మందికి ఉద్యోగావకాశాలు మా ప్రభుత్వం ద్వారా వస్తాయని మేము చాలా గర్వంగా చెబుతున్నాము. అదేవిధంగా, సుమారు రూ.2.13లక్షల కోట్లు హైదరాబాదుకు పెట్టుబడుల రూపంలో వస్తాయి. ఈ విషయాన్ని గౌరవ గవర్నర్‌గారు ప్రస్తావించగానే తెలంగాణ ప్రజలందరికీ ఎంతో ఉత్సాహం కలిగింది. భారతదేశంలోనే ఫార్మారంగం 1/3 వ వంతు అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలో జరిగిందంటే మనకెంతో సంతోషదాయకం. ఫార్మా, బయోటెక్ రంగాన్ని మరింతగా అభివృద్ధి సాధించేందుకు మనం కృషిచేయాలి.

పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు మరియు శాసనపరిషత్ సభ్యులు ప్రజలకు మరింత దగ్గరగా ఉండాలనే ఉద్దేశ్యంతో నివాసం ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉంది. మంచి అభివృద్ధికోసం వివిధ రంగాల్లో నైపుణ్యం గల సామాజికవేత్తలు, సంఘసంస్కర్తలు, మేధావులతో కూడిన ఒక సలహాసంఘాన్ని కూడా ఏర్పాటుచేసి మన తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే మేటి రాష్ట్రంగా చేస్తామనే విషయం గవర్నర్‌గారి ప్రసంగంలో ఉంది. ఇంతకన్నా ఏమి కావాలి. గవర్నర్‌గారి ప్రసంగంలో క్లారిటీ లేదని కొంతమంది అంటున్నారు. ఏదైనా క్లారిఫికేషన్ కావాలంటే తర్వాత తీసుకోవచ్చు. గవర్నర్‌గారి ప్రసంగం చప్పగా ఉందని అంటున్నారు, అది అవాస్తవం. గవర్నర్‌గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేయడానికి మేమంతా గర్వపడుతున్నాము. సభ్యులంతా ఇదే ధోరణితో మాట్లాడి ప్రోత్సహించాలని కోరుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.స్వామిగౌడ్ (మెదక్, నిజామాబాదు, ఆదిలాబాదు, కరీంనగర్): అధ్యక్షా, గవర్నర్‌గారి ప్రసంగంలో ప్రస్తావించిన సంక్షేమ పథకాల గురించి గౌరవసభ్యులు శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డిగారు చెప్పిన అభిప్రాయాలను బలపరుస్తూ, వివిధ పార్టీలకు చెందిన గౌరవ శాసనపరిషత్ సభ్యులకు, గౌరవ ఉపముఖ్యమంత్రిగారికి, గౌరవ మంత్రివర్యులకు మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గవర్నర్‌గారి ప్రసంగంలో ప్రస్తావించిన సంక్షేమ పథకాల విధానం సంతోషించదగ్గదే. కానీ, ఏనాడైతే తెలంగాణ రాష్ట్రాన్ని, ఆంధ్రరాష్ట్రంలో విలీనం చేసారో ఆనాటి ఒప్పందాలను తుంగలో తొక్కడంవల్ల వలసవాదులైన ఆంధ్ర ప్రాంత రాజకీయనాయకులు, పెద్దలు ఆడిన జగన్నాటకంలో తెలంగాణ ప్రాంతం నష్టపోయిన మాట వాస్తవం. తెలంగాణ రాజకీయ నాయకులు దానిని చూస్తూ ఉండిపోయిన పరిస్థితి గతంలో ఉండేది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం గత 60 సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్ర విలీనం నాడే ప్రారంభమైనప్పటికీ, శ్రీ చెన్నారెడ్డిగారు, శ్రీ జనార్ధన్‌రెడ్డిగారు, శ్రీ ఇంద్రారెడ్డిగారిలాంటి వారు కొనసాగించినప్పటికీ, శ్రీ కె.సి.ఆర్. మాదిరిగా ధైర్యంగా నిలబడకపోవడం, ఎక్కడో ఒకచోట, ఏదో ఒక విషయంలో బెండ్ అవడం వల్ల తెలంగాణ ఉద్యమం నీరుగారిపోయింది. తెలంగాణ ప్రాంతంవారికి ఉద్యోగావకాశాలు లేకపోవడం, ఉదాహరణకు, తెలంగాణ ప్రాంతంలో ఉన్న రంగారెడ్డి జిల్లాలో ఆంధ్రప్రాంత ఉపాధ్యాయులు పనిచేయడంలాంటి వాటి వల్లనే అనేకమంది తెలంగాణ ప్రాంత విద్యార్థినాయకులు, ఉద్యోగులు, సింగరేణి, ఆర్.టి.సి. కార్మికులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం జరిగింది. తెలంగాణ ప్రాంతంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ఆనాడే పెద్దలు శ్రీ కె.సీ.ఆర్.గారు అప్పటి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఆనాడు రైతులు చేపట్టిన ఆందోళన

కార్యక్రమంలో సీమాంధ్రులు చేసిన ఫైరింగ్‌లో అనేకమంది రైతులు, విద్యార్థులు చనిపోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగితే తప్ప ఈ ప్రాంతానికి న్యాయం జరగదనే ఉద్దేశ్యంతో శ్రీ కె.సీ.ఆర్.గారు పెద్దలు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి నివాసంలో 2001వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపించడం జరిగింది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఎటువంటి భయానికి, స్వార్థానికి, ప్రలోభాలకూ లోనుకాకుండా క్రే.సీ.ఆర్. చచ్చుడో, తెలంగాణ వచ్చుడ్లో అనే నినాదంతో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడం జరిగింది. కొంతమంది పెద్దలు అనేక కారణాల వల్ల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం సిద్ధాంతపరంగా మాట్లాడలేకపోయినా, తెలంగాణలో ఉన్న ప్రతిబిడ్డా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని ఆకాంక్షించిన మాట వాస్తవం.

11.20 ఉ. వాళ్లు మనసులో అనుకున్నారు, మనం పోకపోతే ఎలా అని వారు ఉద్యమం చేస్తున్నారు, మనం సహకరిద్దామనే ఉద్దేశ్యంతో అందరూ సహకరించారు. అదే విధంగా తెలంగాణా ఉద్యమ నేపధ్యంలో ఉస్మానియా యూనివర్శిటీలో విద్యార్థులపై ఫైరింగ్ చేసి, మహిళలని కూడా చూడకుండా ప్రభుత్వం దమనకాండకు పాల్పడితే ఇక్కడున్న తెలంగాణా నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా ఖండించారు. అదే విధంగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు కూడా ఉద్యమ నేపధ్యాన్ని పరిశీలించి తెలంగాణా ఇవ్వమని కోరడం జరిగింది. ఇక్కడి పరిస్థితులను కూడా గమనించమని వారు చెప్పడం జరిగింది. ఈ సభ ద్వారా వారికి కూడా నేను ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ప్రధానంగా ఇంత ఉద్యమం జరుగుతున్న నేపథ్యంలో ఏఐసిసి ప్రధాన అధ్యక్షులు శ్రీమతి సోనియాగాంధీగారు అనేక కమిటీలు వేసి పరిశీలించమని కోరారు. జరిగిన పొరపాటల్లా దాదాపు 11 సంవత్సరాల కాలయాపన జరగడం వల్ల విద్యార్థి, ఉద్యోగ సంఘాలు తట్టుకోలేకపోయాయి. ఇంక తెలంగాణ రాదేమోనని ఆలోచనతో ఆత్మహత్యలు ఎక్కువయ్యాయి. కెసిఆర్‌ను ఎక్కడ చంపుతారోనని నన్ను చంపితే తెలంగాణా వస్తుందని, శ్రీకాంతాచారి నేను చనిపోతే తెలంగాణ వస్తుందని బిడ్డ పెట్రోలు పోసుకుని తగులబెట్టుకున్న వైనం మనకు తెలుసు. అక్కడనుండి మొదలుపెడితే నేటికి దాదాపు 2500మంది విద్యార్థులు అమరులయ్యారు. వారి త్యాగాల ఫలితమే ఈ తెలంగాణా అని నేను మనవి చేస్తున్నాను.

శ్రీ వి. భూపాల్‌రెడ్డి : అధ్యక్షా, సభ్యులు గవర్నర్‌గారి ప్రసంగంమీద మాట్లాడమంటే తెలంగాణా ఉద్యమం గురించి మాట్లాడుతున్నారు.

శ్రీ కె. స్వామిగౌడ్ : అధ్యక్షా, ఇక్కడ నా ఉద్దేశ్యం తెలంగాణా రాష్ట్రం ఏర్పడడానికి కారణాలు తెలియచేయడం. వారి యొక్క త్యాగాల కారణంగానే నేడు మనం ఈ సభలో

ఇప్పుడు కూర్చోగలిగాము. ఆ విషయాలను ఒకసారి మననం చేసుకోవలసిన అవసరం ఉన్నదని నేను భావిస్తున్నాను. ఉద్యమంలో అనేకమంది సహకరించారు.

శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్ : అధ్యక్షా, అమర వీరుల సంఖ్య 2500 అని గౌరవ సభ్యులు అంటున్నారు చాలా సంతోషం. కానీ, ప్రభుత్వం నుండి 500 అని అంటున్నారు. ఒకసారి పరిశీలన చేసుకుని ఎవరికీ అన్యాయం జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నది.

శ్రీ కె. స్వామిగౌడ్: అధ్యక్షా, పెద్దలు చెప్పిన ఈ మాటలను తప్పకుండా నేను ప్రభుత్వం దృష్టికి తీసుకువెడతాను. ఈనాడు తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు కావడానికి గల కారణాలను మనం గుర్తుంచుకోలేకపోతే అమరుల త్యాగాల ఫలితాలు నిష్ప్రయోజనమవుతాయి. కేసిఆర్ గారు చేసిన ఉద్యమానికి జాతీయనాయకుల తోడ్పాటు ఉన్నది. సోనియాగాంధీగారి సహకారం ఉన్నది, చంద్రబాబునాయుడు గారు ఇచ్చిన లేఖ ఉన్నది. అలాగే ఉపాధ్యాయ సంఘాలు మొదలుకొని ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో పాలు పంచుకున్నారు. అందరి త్యాగాల ఫలితమే ఈ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు అని చెప్పడమే నా అభిమతం గానీ, పాత కథే మళ్లీ చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. జయశంకర్ గారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకున్న ఈ ఉద్యమంలో అనేకమంది పలు ఆకాంక్షలు పెంచుకున్నారు. అయితే, మనకు సంపూర్ణమైన తెలంగాణా రాలేదు. ఉద్యోగుల విభజన విషయమై వారిలో రకరకాల అపోహలు ఉన్నాయి. ఆప్షన్ల పేరుతో దాదాపు 48వేల మంది ఉద్యోగులు ఇక్కడే ఉన్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తెలంగాణా ఉద్యోగులు ఆంధ్రాకు అలాట్ చేయబడ్డారు. ఆంధ్రా ఉద్యోగులు తెలంగాణాలో అలాట్ కాబడ్డారు. దీనిని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. నేను చెప్పదల్చుకున్నదేమంటే తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దానికనుగుణంగానే గవర్నరుగారి ప్రసంగంలో ఉన్న ఒక్కొక్క పథకానికి సంబంధించి పెద్దలు శ్రీ సుధాకర రెడ్డి గారు వివరంగా చెప్పారు. మళ్లీ నేను ఆ వివరాలలోకి పోదల్చుకోలేదు. ఈ పథకాలన్నీ నిర్మాణాత్మకంగా అమలు జరగాలంటే ఈ సభలో కూర్చున్న ప్రతి ఒక్క సభ్యుడినుండి సూచనలు తీసుకోవలసిన అవసరం ఉన్నది. విమర్శ సహేతుకంగా ఉండాలి. భారతదేశంలో తెలంగాణా రాష్ట్రమనే పసిబిడ్డ పుట్టింది. ఈ బిడ్డను కాపాడవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నది. ఇక్కడున్న రాజకీయ వ్యవస్థ మారింది, కింద ఉన్నటువంటి పరిపాలనా వ్యవస్థ మారింది. అందువల్ల ప్రభుత్వానికి సరైన సమాచారం ఇప్పుడిప్పుడే అందుతున్నది. మొన్న జరిగినటువంటి బ్యాంకర్ల సమావేశంలో కూడా పాత ఋణాలు ఎన్ని, కొత్త ఋణాలు ఎన్ని

అనేవాటిపై ఇంకా పూర్తి సమాచారం తెలియవలసి ఉన్నది. అందుకని, ఇక్కడ ఉన్నటువంటి సభ్యులకు నేను మనవిచేసేదేమంటే ప్రతి ఒక్క సభ్యుడు నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలు ఇచ్చి ప్రభుత్వాన్ని ముందుకు తీసుకువెళ్ళి బంగారు తెలంగాణాను రూపొందించుకుందామని తెలియచేస్తున్నాను. ఇది కేవలం తెలంగాణా ప్రభుత్వం వల్ల మాత్రమే సాధ్యమవుతుందని అనుకోకుండా అందరం కలిస్తేనే బండి ముందుకు వెడుతుంది అదే విధంగా ఇక్కడున్న ప్రతి ఒక సభ్యుడు సహకరిస్తే ప్రభుత్వం ముందుకు వెడుతుంది. హైదరాబాదులో మాతోపాటు కలిసి ఉద్యమంలో పాల్గొన్న ముస్లిం సోదరుల పాత్ర మరువలేనిది. వారికి సంబంధించి పెద్దలు చెప్పినట్లుగా రిజర్వేషన్ల విషయంలో **4** శాతం నుండి **12** శాతం పెంచడంపట్ల రకరకాల ఇబ్బందులు ఉన్నాయని చెప్పే మాటలు వాస్తవం. తెలంగాణా ప్రభుత్వ ఉద్దేశ్యం ఒక్కటే అది ఏమిటంటే, ఖచ్చితంగా మన రాష్ట్రంలో ఉన్న మన బిడ్డలకు మనం సహాయం చేసుకోవాలి. భారత రాజ్యాంగంలో ఖచ్చితంగా పలు నిబంధనలు ఉండవచ్చు కానీ, ....

శ్రీ డి. శ్రీనివాస్ : అధ్యక్షా, కె. స్వామిగౌడ్ గారు మాట్లాడుతూ **4** శాతం నుండి **12** శాతం పెంచడంలో సాధ్యాసాధ్యాల గురించి మాట్లాడడం లేదు. ఈ విషయంలో మా పార్టీ చాలా గట్టిగా సపోర్టు చేస్తుంది. మీరు ఏ విధంగా చేస్తారో చేయండి. మేము అందుకు ఏ మాత్రం వ్యతిరేకం కాదు, మా సహకారం పూర్తిగా అందిస్తామని తమద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ కె. స్వామిగౌడ్ : చాలా సంతోషం అధ్యక్ష. పెద్దలు సహకరిస్తామంటున్నారు. వారికి తెలంగాణా ప్రభుత్వం పక్షాన కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. తప్పకుండా ఈ విషయంలో ప్రభుత్వం విజయం సాధిస్తుందనే నేను భావిస్తున్నాను. ఈ పెద్దల సభలో అందరి సహకారం ప్రభుత్వానికి ఉంటుందని వారి సూచనలతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని నేను మనవి చేస్తున్నాను. ప్రతిపక్షంలో ఉన్నవారు చక్కటి సలహాలు, సూచనలు చేస్తే వాటిని అమలు చేయడంకన్నా ప్రభుత్వానికి కావలసిందేమీ ఉండదు. ప్రతిపక్షం వారు చేసే సహేతుకమైన విమర్శలను తప్పకుండా స్వీకరించి ప్రభుత్వాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. నాకు ఇటువంటి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

OATH

SRI M.S. PRABHAKAR RAO: (Local Authorities-Hyderabad) I Sri M.S. Prabhakar Rao having been elected as a Member of the Telangana Legislative Council do swear in the name of the God that

I will bear true faith and allegiance to the Constitution of India as by established that I will uphold the sovereignity and integrity of India and that I will faithfully discharge the duty upon which I am about to enter.

I, Sri M.S. Prabhakar Rao, Member of the Telangana Legislative Council swear in the name of the God that I shall abide by and follow the rules, observe the etiquettee, discipline and respect the conventions of this House.

MR. CHAIRMAN: Now tea break for fifteen minutes.

(The House then adjourned at 11.32 a.m. for tea break for fifteen minutes)

(After tea break, the House reassembled at 11.55 a.m. with the Hon'ble Chairman in the Chair)

మిస్టర్ ఛైర్మన్: శ్రీనివాస్‌గారు మాట్లాడండి.

శ్రీ డి. శ్రీనివాస్ : అధ్యక్షా, నా అవకాశాన్ని రేపు తీసుకోదలిచాను. ఇప్పుడు మాపార్టీ తరపున పొంగులేటి సుధాకర్ రెడ్డిగారు మాట్లాడుతారు.

మిస్టర్ ఛైర్మన్: ఓ.కె.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (అసెంబ్లీ) : అధ్యక్షా, ఇదొక చారిత్రాత్మకమైన క్షణం. తెలంగాణా రాష్ట్రం దేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పడి భారతదేశ చరిత్ర పుటల్లోకి ఎక్కిన నేపథ్యంలో, రాజ్యాంగ ప్రతినిధి , ఈ రాష్ట్ర ప్రభుత్వ అధినేతగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్‌గారు చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో, నేను మూడు కోణాలలో దీన్ని ఆవిష్కరించదలుచుకున్నాను. మనస్ఫూర్తిగా తీర్మానానికి ధన్యవాదాలు చెప్పడం ఒక కోణం, అన్యమనస్కంగా తీర్మానానికి ధన్యవాదాలు చెప్పడం రెండో కోణమైతే, కొన్ని అంశాలు ప్రసంగంలో మెన్షన్ చేయని నేపథ్యంలో ప్రజాపక్షం వహిస్తున్న ప్రతిపక్ష ప్రతినిధిగా ఈ తీర్మానాన్ని వ్యతిరేకించడం .. ఈ మూడు కోణాలలో దీన్ని ఆవిష్కరించడానికి నేను ప్రయత్నం చేస్తున్నాను. ఏదేమైనా తెలంగాణ బిడ్డగా తమరి అనుమతితో, మా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఈ సభలో ప్రతిపక్షానికి నాయకత్వం వహిస్తున్న శ్రీ డి. శ్రీనివాస్ గారు ఇచ్చిన అవకాశాన్ని విజ్ఞుల సమక్షంలో సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేస్తాను.

అధ్యక్షా, అధికార పక్ష సభ్యులు మాట్లాడుతూ, ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి సూచనలు చేయాలని కోరారు. 60 సంవత్సరాల కల సాకారమైన నేపథ్యంలో నాకంటె ముందు మాట్లాడిన పెద్దలు అనేక అంశాలు ప్రస్తావించారు. అనేక మంది ప్రజల త్యాగఫలమే తెలంగాణ రాష్ట్రమని చెప్పారు. ఈ ఉద్యమం 1969లో మా జిల్లాలోని పాల్వంచలో మొదలైంది. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారు రాజ్యాంగంలో ఆర్టికల్-3ని పొందుపరిచారు. ఆ ఆర్టికల్-3 లేకపోతే ఈనాడు ఈ తెలంగాణ రాష్ట్రం సాకారమయ్యేది కాదు. రాజ్యాంగ ప్రతినిధిగా గవర్నర్‌గారు వ్యవహరిస్తున్న నేపథ్యంలో, ఈ రాష్ట్రం ఏర్పడిన శుభ సందర్భంలో, పండుగ సందర్భంలో నేను మనస్ఫూర్తిగా గవర్నర్‌గారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఇదే సమయంలో కృతజ్ఞతలు చెప్పవలసి వస్తే, మా నాయకురాలు సోనియాగాంధీ గారు తమ పొట్ట ఒకవైపు కోసుకుని కూడా, అనేక ఇబ్బందులు ఎదురైనా కూడా, ఆలస్యమైనప్పటికీ, పూర్తిగా నష్టపోయినా, 1969లో నాటిన మొక్క వృక్షమైన సందర్భంలో, ఆ వృక్ష ఫలాలను ఇచ్చిన యుపిఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ గారికి ఈ సభ తరపున నేను శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ రాష్ట్రం ఆమె వల్లే సాకారమైంది. అదే విధంగా అమరులైన అనేక మందికి సెల్యూట్ చేస్తున్నాను, స్వర్గంలో ఉన్న వారందరికీ సెల్యూట్ చేస్తున్నాను. వారి కుటుంబాలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వాళ్ల కుటుంబాలు పడిన వేదనను ఇంతకు ముందు మెన్షన్ చేశారు. శ్రీకాంతాచారి ఉద్యమంలో ఉంటూ అసువులు బాశారు. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. మా జిల్లాలో దస్తగిరి, రాంచందర్, రవీందర్ లాంటి వాళ్లు 1969లో వచ్చిన ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ వారి కుటుంబాలు దుఃఖ సాగరంలోనే ఉన్నాయి. తెలంగాణా రాష్ట్రం సాకారమైన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులకు మేము స్వయంగా సన్మానం చేశాం . తెలంగాణ రాష్ట్రం సాకారమైన నేపథ్యంలో అమరులైన అనేక మంది కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వీరితోబాటుగా కృతజ్ఞతలు చెప్పాలంటే ముందు ఆర్టికల్-3ని పొందుపరచిన రాజ్యాంగ ప్రదాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారికి, రాష్ట్రం ఇచ్చినటువంటి సోనియాగాంధీ గారికి చెప్పాలి. అధ్యక్షా, మీ అనుమతితో నేను ఒక ఉత్తరం కూడా ఇవ్వబోతున్నాను. గవర్నర్ ప్రసంగంలో మేము ఎక్స్‌పెక్ట్ చేశాం .

**12.00 మ.** శ్రీమతి సోనియాగాంధీగారు ఉభయ సభల్లో ఈ బిల్లుని చట్టం చేయడం కొరకు ఎంత తపన పడ్డారో మాకు తెలుసు. కొత్తగా ఏర్పడినటువంటి టిఆర్ఎస్ ప్రభుత్వం, వారి యొక్క మానసిక దృక్కోణం, ఏదెతై విజన్ తెలియపరిచే ఈ యొక్క డాకుమెంట్‌లో

శ్రీమతి సోనియాగాంధీ గారికి కృతజ్ఞత తెలిపినట్టుగా ఒక్క సెంటెన్స్ కూడా చేర్చకపోవడం కొంత మాకు బాధ కలిగినటువంటి అంశం. రకరకాలుగా అన్ని పార్టీలు క్లెయిమ్ చేయవచ్చు. కాని but for Smt. Sonia Gandhi ఇప్పుడు రాష్ట్ర అధినేతగా ఉన్నటువంటి శ్రీ కె. చంద్రశేఖర రావు గారు కృతజ్ఞతలు చెప్పి బయటకు వచ్చిన తరవాత but for Smt. Sonia Gandhi తెలంగాణ రాష్ట్రం సాకారమైందని తెలిపారు. నేను ఇక్కడ ప్రపోజ్ చేస్తున్నాను. శ్రీమతి సోనియాగాంధీ గారికి కృతజ్ఞత చెప్పే అంశాన్ని గవర్నర్ గారి అడ్రస్‌లో చేర్చాలని కార్యదర్శి గారికి మరియు తమరికి అడ్రస్ చేస్తూ ఒక అమెండ్ మెంట్ తీసుకువచ్చే అవకాశం మా అందరికి కలుగజేయండి.

శ్రీమతి సోనియాగాంధీ చొరవ, తెగింపు, సహజ న్యాయంతో ఇచ్చినటువంటి తెలంగాణ రాష్ట్రం. ఈ క్షణం స్వరాష్ట్రంలో స్వపరిపాలన. నిజంగా ఆనందం, చరిత్రలో మరచిపోలేనటువంటి అవకాశం. ఒక శాసన మండలి సభ్యుడిగా మాకు ఈ అవకాశం కల్పించిన నేపథ్యం కూడా ఈ చారిత్రాత్మక జూబ్లీహాల్లో దీనిని ఎప్పుడు కూడా గుర్తుంచుకొనే అంశం. దానికి అవకాశం ఇచ్చిన పెద్దలందరికీ, తమరికి కృతజ్ఞతలు.

పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలం, మాపాలన మాకే అని తిరగబడ్డ గానం, ఎంతోమంది కవులు, ఎంతోమంది కళాకారులు, ఎంతోమంది ఉద్యమనేతలు, ఎంతోమంది రచయితలు, ఎంతోమంది విద్యార్థులు, సకలజనుల త్యాగం, వీటన్నింటితోపాటు శ్రీమతి సోనియాగాంధీగారి కన్నతల్లి మనసు మొదలైన అన్నింటివల్లే ఈ తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. శ్రీకాంతాచారి తండ్రి శ్రీ వెంకటాచారితోపాటు నేను నాలుగు సంవత్సరాల క్రితం పార్లమెంటులో శ్రీమతి సోనియాగాంధీగారి కార్యాలయానికి వెళ్లినపుడు శ్రీ వెంకటాచారి ఆవేదనను చూసి శ్రీమతి సోనియాగాంధీగారు తన సీట్లోనుంచి లేచి వచ్చి కళ్లు చెమర్చారు. శ్రీ వెంకటాచారి గారు ఏడ్చుకుంటూ, తాను కార్పెంటర్‌నని, కేవలం రూ. 3 వేలు మాత్రమే నెలకు సంపాదిస్తానని చెబుతూ, తన ఇద్దరు కొడుకులలో ఒక కొడుకు తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేయడం జరిగిందని తెలుగులో చెబుతూ ఉంటే శ్రీమతి సోనియాగాంధీగారు సుధాకర్, ఇస్‌కే లియే కుచ్ కర్జో అని అంటే ఆ కుటుంబానికి నా మూడు నెలల జీతాన్ని నేను ఇవ్వడం జరిగింది. నా ఎమ్.ఎల్.సి. నిధులను కూడా విడుదల చేసి వారి ఊరులో రహదారి నిర్మాణం చేసి ఆ రహదారికి శ్రీకాంతాచారి పేరును కూడా పెట్టడం జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు భద్రాచలం వరకూ సుమారు 450 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన తర్వాత ఆ పాదయాత్రలో కొడుకు చనిపోయిన బాధ కూడా దిగమింగి

శ్రీ వెంకటాచారి ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులతోపాటు పాదయాత్ర చేయడం జరిగింది. ఇలాంటి అనేకమంది అమరవీరుల త్యాగాలను చూసి శ్రీమతి సోనియాగాంధీగారు స్పందించి మరో ప్రాంతంలో నష్టం జరుగుతున్నా తెలంగాణ రాష్ట్రం ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్‌పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చినా, తెచ్చిన పార్టీగా వారు చెప్పుకోవడమంటే, అడవిలో పండ్లు ఇచ్చే చెట్టు కనిపించినపుడు సహజంగా పండ్లు తీసుకోవడానికి వెళ్లిన వ్యక్తికి త్వరగా పండు అందుతుంది. పండు ఇచ్చిన చెట్టుకు కూడా తృప్తి ఉంటుంది. సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డిగారు, శ్రీ కె.స్వామిగౌడ్‌గారు మాట్లాడింది టి.ఆర్.ఎస్. ఊహాచిత్రం. స్క్రిప్ట్ బ్రహ్మాండంగా తయారైంది. ఈ ఊహాచిత్రం ఎన్నికలకు ముందుకూడా ఉంది. టి.ఆర్.ఎస్.యొక్క ఎన్నికల ప్రణాళికను ఇప్పుడు కూడా గవర్నర్‌గారు ఆవిష్కరించారు. ఈ ఊహాచిత్రం వాస్తవిక చిత్రంగా రూపొందినపుడు వినసొంపుగా, కంటికి ఇంపుగా తెలంగాణ కల సాకారం, నిజమైన సార్థకత ఆనాడే ఉంటుంది. అదే చెప్పాలని నేను ప్రయత్నిస్తున్నాను. ఆ విధంగా జరగాలని, జరుగుతుందని మేము ఆశిస్తున్నాము. ఆ విధంగా జరగకపోతే వారు కూడా ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని కూడా ఈ సందర్భంగా సున్నితమైన హెచ్చరికను చేస్తున్నాను.

ఈ డాక్యుమెంట్ గురించి నేను మనస్ఫూర్తిగా ఒక రాజ్యాంగ ప్రతినిధిగా చెబుతున్నాను. కానీ, సగం మనస్సుతో చెప్పే కొన్ని అంశాలు కూడా ఉన్నాయి. నేను ఇంతకుముందే చెప్పాను. ఆత్మగౌరవబాట, రెపరెపలాడించిన కోటి ఆశలతో, ఆకాంక్షలతో సరికొత్త చరిత్రకు ఆరంభం, ఇవన్నీ అయిన తర్వాత, ఇంత కార్యక్రమం జరిగితే, మాకు ఇందులో కొన్ని అంశాలను కూడా పొందుపర్చలేదు. వారు సర్వజనహితం, సర్వజనశ్రేయస్సు అని కంక్లూడ్ చేశారు. సర్వజనహితం కోరుకోవాలి. అప్పుడే ఈ తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వ పోరాటానికి స్వేచ్ఛాస్వాతంత్ర్యం కొరకు ఉద్వేగం, నాయకత్వపు ఉబలాటం, మాగూటికొరకు స్వరం, మావాటికొరకు ప్రతిస్వరం, ఇది మానీటి కొరకు సమాయత్తం, మాపాటు కొరకు మా సాధనం, మా విద్య, మా ఉపాధుల కొరకు నినాదం, ఇవి మా భూములు, మా జాగ కొరకు వచ్చిన ఈ తెలంగాణ ఎలుగెత్తింది జనం, జనం ఆత్మగౌరవ గాంఢీవం, తెలంగాణ అంతటా శంఖారావం అమరుల త్యాగం, అయింది తెలంగాణ రాష్ట్రసాకారం, సకలజనుల పోరాటం, ఆరు దశాబ్దాల ఆరాటం ఇది సోనియమ్మ ఇచ్చిన వరం అని గర్వంగా చెబుతున్నాను. శ్రీమతి సోనియాగాంధీగారికి తలవంచి ఈ సందర్భంగా మరొకసారి సెల్యూట్ చేస్తున్నాను. ఎందుకంటే, ఆ క్షణంలో అక్కడున్న విషయాలు ఇక్కడున్న పెద్దలందరితోపాటు మేము చూడడం జరిగింది. రాజకీయాల్లో సన్యాసులు ఎవరూ ఉండరు. భవిష్యత్తులో

తప్పనిసరిగా అధికారం ఉంటుంది, ఇంకా మంచి కార్యక్రమాలు చేద్దాం. కానీ, ఈ నేపథ్యంలో ఈ వీర తెలంగాణ నాది, ఈ వేరు తెలంగాణ నాది, ముమ్మాటికీ తెలంగాణ వెర్రై నిలిచి భారతాన వెలయ్యు అని కాళోజీ చెప్పిన మాట ముమ్మాటికీ నిజం కావాలని నేను కోరుతున్నాను. దానికొరకు కాంగ్రెస్‌పార్టీ చేసిన కృషి అమోఘం. కోటిలింగాలతో మొదలై శాతవాహనుల కాలం నాటి అనేక కార్యక్రమాలు రామప్పగుడి, వెయ్యి స్థంభాల గుడి మొదలైనవి. శ్రీ హనుమంతరావుగారు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు, శ్రీ దాశరథిగారు, శ్రీ కాళోజీగారు, శ్రీ జయశంకర్‌గారు, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీగారు లాంటి మహానుభావులు అనేకమంది తెలంగాణలో ఉన్నారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు కూడా ఎప్పటికైనా ఆంధ్ర,తెలంగాణ ప్రాంతాల విభజన సమంజసమే అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఇటువంటి నేపథ్యం ఉన్న ఈ తెలంగాణలో మన తెలంగాణ కోటి సిరిసంపదల ఖజానాగా కావాలని, మన తెలంగాణ కోటి ఔదార్య ఔన్నత్యాల తికాణా కావాలని, మన తెలంగాణ కోటి సాహిత్య, సాంస్కృతిక, సంగీత ఘరానా కావాలని, మన తెలంగాణ కోటి వితరణల, అతిథి సత్కారాల, మర్యాదల సోన కావాలని, మన తెలంగాణ మా దాశరథి కొనియాడిన కోటి రతనాల వీణ కావాలని, మా తెలంగాణ మా కాళోజీ వశించిన నివేదన కావాలని, మా తెలంగాణ స్వపరిపాలన సుపరిపాలన కొరకు నాలుగు కోట్ల గొంతుకలతో ధ్వజమెత్తిన ప్రభంజనం కోటి ఆశలతో ఎదురు చూస్తున్న నివేదన కావాలని ఈ తెలంగాణ సంస్కృతి మనమంతా కలసిమెలసి ఉండే కార్యక్రమం, ఆ రకమైన పరిస్థితికి పూలబాటలు వేయండి. తప్పనిసరిగా నిర్మాణాత్మక పాత్ర ప్రతిపక్షం వహిస్తుంది. వారు ఏదెతై చెప్పారో అవన్నీ తు.చ. తప్పకుండా అమలు చేసేటట్లు చేయాలని మేము విజ్ఞప్తి చేస్తూ, అవసరమైతే ప్రజాపోరాటం చేసి అయినా సరే వారి భాషలోనే, మెడలు వంచైనా సరే చేయించే కార్యక్రమానికి మేము ప్రజాపక్షంగా నిలబడతామని చెబుతున్నాము.

నేను ఖమ్మం జిల్లా వాస్తవ్యుడిని. పోలవరం ప్రాజెక్టు ఆర్డినెన్స్ విషయంలో ఆ ప్రాంతమంతా అట్టుడికిపోతోంది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన సంతోషం ఒకవైపు, మూడు, నాలుగు లక్షల గిరిజనుల ఆక్రందన మరొకవైపు ఉంది. మా గిరిజనుల పక్షాన 7 మండలాలను అక్రమంగా, అన్యాయంగా, అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా బుల్‌డోజ్‌చేసి తెరవెనుక కొంతమంది పెద్దల ప్రమేయంతో పోలవరంలో ముంపు ప్రాంతం పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన నేపథ్యం ఉంది. 205 Hamletsతో కలిపి సుమారు 134 రెవెన్యూ పంచాయితీలను మేము కోల్పోయే పరిస్థితి ఉంది. ఈ 7 మండలాలు పోతే మా పరిస్థితి అగమ్యగోచరంగా

ఉండే పరిస్థితి ఉంది. 337 రెవెన్యూ పంచాయితీలతోపాటు దాదాపు 500 గ్రామాలను కోల్పోతున్నాము. దీనివల్ల లోయర్ సీలేరు చించూరు వద్ద 460 మెగావాట్ల మొట్టమొదటి నీరు ఆధారిత హైడల్ పవర్ ప్రాజెక్టును మేము కోల్పోతున్నాము. సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీరును అందించగల ఇందిరాసాగర్ ప్రాజెక్టుకోసం ఇప్పటికే సుమారు రూ. 900 కోట్లను ఖర్చుచేయడం జరిగింది. నాలుగు గిరిజన తెగలు కూడా వారి అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదముంది. మేము మొట్టమొదటగా కోరుకునేది, పోలవరంపై ఇచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే విత్‌డ్రా చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రిగారికి కూడా మేము ఒక విజ్ఞాపనపత్రం ఇచ్చాము. మా నాయకుల దృష్టికి కూడా ఈ విషయాన్ని మేము తీసుకెళ్లడం జరిగింది. నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అభద్రతాభావంతో కేంద్రప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై ఇచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే విత్‌డ్రా చేయడంకోసం చొరవతీసుకోవాలని ఈ రాష్ట్రప్రభుత్వాన్ని తమరిద్వారా నేను కోరుకుంటున్నాను. అదేవిధంగా, సరిహద్దురాష్ట్రాలకు చెందిన నలుగురు ముఖ్యమంత్రులతో మాట్లాడి పోలవరం ప్రాజెక్టు ముంపుప్రాంతాలకు కలిగే నష్టాన్ని తగ్గించడం కోసం తగిన చర్యలు తీసుకోవలసిందిగా తమరి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నాను. అవసరమయితే మన ప్రాంతానికి చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనపరిషత్ సభ్యులను గౌరవప్రధానమంత్రిగారి వద్దకు ముఖ్యమంత్రిగారు తీసుకెళ్లి తీర్మానంతోపాటు ఒక రిప్రజెంటేషన్‌ను కూడా ఇవ్వాలని తమరిద్వారా నేను కోరుతున్నాను. ఎందుకంటే, నీరు అరవై అడుగులకు చేరితే పాపికొండలను, భద్రాచలం టౌన్‌ను కోల్పోయే ప్రమాదముంది. రాబోయే రోజుల్లో శ్రీరామచంద్రుడు తనను తాను రక్షించుకునే పరిస్థితి కూడా వస్తుంది. సభ్యులు శ్రీ సుధాకర్‌రెడ్డిగారు భవిష్యత్తులో జరగబోయే వాటి గురించి కనులకు కట్టినట్లుగా చూపించారు. అవన్నీ తప్పకుండా జరగాలని మా నాయకులు కూడా చెప్పడం జరిగింది. మైనారిటీలకు 12 శాతం, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం చేసిన హామీని తప్పకుండా నెరవేర్చాలి. రైతులకు రుణమాఫీ ఎన్ని సంవత్సరాలకు, ఏ కేటగిరీకి చెందిన వారికి ఇస్తున్నారో ఎటువంటి కార్యాచరణ ప్రణాళిక గవర్నర్‌గారి ప్రసంగంలో లేదు. అన్ని వివరాలను ప్రభుత్వం రిప్లై రూపంలో ఇవ్వడం జరుగుతుందని మంత్రి శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డిగారు చెప్పడం జరిగింది. ఒక్క రైతుప్రాణం కూడా పోవడానికి వీలులేదు. రుణమాఫీ ఏ విధంగా ఇవ్వడం జరుగుతుందో ముఖ్యమంత్రిగారు వారి సమాధానంలో చెప్పాలి. అన్నదాతలను ఎక్కడా కించపరిచేవిధంగా మాట్లాడకూడదు. కౌలురైతులకు కూడా రుణమాఫీ పథకాన్ని వర్తింపజేసి వారిని కూడా ఆదుకోవాలి.

కె.జి. నుంచి పి.జి. వరకూ కూడా ఉచితవిద్యను అందించాలి. ప్రస్తుతం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ప్రయివేటు యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డొనేషన్లను వసూలు చేయకుండా చూడాలి. వాటన్నింటినీ చేసినట్లయితే మేమంతా చాలా సంతోషించి ముఖ్యమంత్రిగారికి ఈ సభలోనే ఘనంగా సన్మానం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అవి చేయలేకపోతే రెండు గంటల సినిమా చూసి మర్చిపోవడమే జరుగుతుంది. ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

గవర్నర్‌గారి ప్రసంగంలో పెరుగుతున్న ధరలను కూడా ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన కానుక రూ. 210 నుంచి రూ. 315 లకు సిమెంటు ధరను పెంచడం. కృత్రిమంగా సిమెంటు కొరతను సృష్టించి ధరను పెంచడానికి కారుకులెవరో గుర్తించి తగిన చర్యలు తీసుకోవలసిందిగా తమరిద్వారా నేను కోరుతున్నాను.

మేము గత ప్రభుత్వంలో రూ. 1 లకే కిలో బియ్యం, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ పథకం, ఆరోగ్యశ్రీ, ఉపాధిహామీ మొదలైన పథకాలను ప్రజలకు అందివ్వడం జరిగింది. యావత్ భారతదేశంలో చారిత్రాత్మకంగా ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్‌ను తీసుకువస్తే కనీసం దానిని ఎక్కడా మెన్షన్ చేయలేదు. బి.సి.లు, మైనారిటీలకు కూడా సబ్‌ప్లాన్‌ను తీసుకురావాలని, అప్పుడే ఆ వర్గాల్లో కూడా నమ్మకం ఏర్పడుతుందని ఈ సందర్భంగా కోరుతున్నాను.

ఖమ్మం జిల్లా వాస్తవ్యుడిగా నేను కోరుకునేదేమంటే, పోలవరం ప్రాజెక్టుతోపాటు మేము గతంలోనే పునాది వేసిన గిరిజన విశ్వవిద్యాలయం, ఖమ్మంలో రావలసిన మైనింగ్ విశ్వవిద్యాలయం గురించి కూడా గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చలేదు. బయ్యారం ఉక్కు కర్మాగారం యొక్క వివరాలను కూడా గవర్నర్‌గారి ప్రసంగంలో పొందుపర్చలేదు.

మా ప్రాంతంలో ఉన్న గిరిజనులకు ఉద్యోగావకాశాల కొరకు ఉక్కు కర్మాగారం కోసం మీరు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. కేంద్రప్రభుత్వం కూడా ఈ విషయంలో తెలంగాణ బిల్లుద్వారా చట్టం చేసింది. దానిని అమలు చేయవలసిన ఆవశ్యకత ఉంది. పోలవరం ప్రాజెక్టుకు ఏ విధంగా అయితే జాతీయహోదా ఉన్నదో అదేవిధంగా ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు కూడా జాతీయహోదా, పాలమూరు ఎత్తిపోతల పథకం మొదలైన వాటికోసం తప్పనిసరిగా కృషిచేయాలి.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఏ స్థాయిలో ఉన్నప్పటికీ వారిని క్షమించి వదిలివేయవలసిన పరిస్థితి ఉండకూడదు. గత ప్రభుత్వాలు చేసిన కేసులను కూడా రెవ్యూ చేయండి. అవినీతికి ఎవరు పాల్పడ్డారో, కాంట్రాక్టర్లు ఏమి చేశారో, కొంతమంది అధికారులు బినామీలుగా ఏవిధంగా వ్యవహరించారో గణాంకాలతోపాటు సమాచారం అందుబాటులో

ఉంది. ఆ కేసులన్నీ కూడా బయటకు తీయాలి. ఎందుకంటే, ప్రజల సొమ్ము, ప్రభుత్వ రెవెన్యూ వాటిలో ఇమిడి ఉంది.

పరిశ్రమలకు భరోసా గురించి సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డిగారు, శ్రీ స్వామిగౌడ్‌గారు చెప్పారు. ముఖ్యమంత్రిగారి కార్యాలయంలో పారిశ్రామికవేత్తల కోసం ఒక టోల్‌ఫ్రీ నెంబరును పెట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఎవరైనా స్థానిక వ్యవహారంలో చందాల రూపాన అక్రమాలకు పాల్పడ్డా, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డా ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియజేయమన్ని ఒక మెస్సేజ్‌ను పారిశ్రామికవేత్తలకు ఇవ్వండి. దానిని పారదర్శకత అని పిలుస్తారు.

12.20 మ. శ్రీ పొంగులేటి సుధాకర రెడ్డి (అసెంబ్లీ) : పారిశ్రామికవేత్తలు ఎవరు ఏం చేస్తారోనని భయపడుతున్నారు. ఎందుకంటే, చెడ్డపేర ఉద్యమకారులకే వస్తుంది కాబట్టి, ఆ రకమైన వాతావరణం ఉంటోంది. విదేశాలనుండి మంచి పరిశ్రములు రావాలన్నా ప్రశాంతమైన వాతావరణాన్ని మనం క్రియేట్ చేయవలసిన అవసరం ఉన్నది. దానికి మా అందరి సహకారం ఉంటుంది. స్థానికులు, స్థానికేతరులు అనే మాటలను బంద్ చేసి ఇక్కడ సెటిల్ అయినవారందరూ తెలంగాణా బిడ్డలే అని భావించాలి. వారిలో ఉన్న అభద్రతాభావాన్ని పోగొట్టవలసిన బాధ్యత రూలింగ్ పార్టీపైన ఉన్నది. దీనికి మేమందరం కూడా సహకరిస్తాము. దశాబ్దాలనుండి ఇక్కడ ఉంటున్నవారిని కంటికిరెప్పలా కాపాడుకోవలసిన అవసరం తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నది. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వెల్ఫేర్, ఇండస్ట్రియలైజేషన్, వ్యవసాయం, విత్తన సరఫరా, ఫెర్టిలైజేషన్ విషయంలో అనుభవజ్ఞులు చాలామంది చెప్పారు. ఇప్పుడు వ్యవసాయ సీజన్ మొదలైంది. బ్లాక్‌మార్కెట్ కూడా మొదలైంది. అంటే, నకిలీ విత్తనాల జోరు ఎక్కువైంది. దయచేసి అందుకు సంబంధించి టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేయండి. కోటి ఆశలతో విద్యార్థులు, నిరుద్యోగులు చాలామంది ఉన్నారు. ఎందుకంటే ఉద్యమ నేపథ్యంలో అసువులు బాసినవారి పాత్ర మరువలేనిది. ఉస్మానియా యూనివర్శిటీ, కాకతీయ యూనివర్శిటీ వంటి పలు ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు ఏ విధంగా ఇస్తారు? ఐ.టి.ఐ.ఆర్ ప్రాజెక్టు గురించి పెద్దలు చెప్పారు. శ్రీమతి సోనియాగాంధీగారి చొరవతో ఈ ప్రాజెక్టును తీసుకురావడం జరిగింది. దీనివల్ల చాలామంది ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. పబ్లిక్ హెల్త్‌గురించి పలు చర్యలు తీసుకోవాలి. మారుమూల ప్రాంతాలే కాకుండా, భద్రాచలం దగ్గర కొన్ని ప్రాంతాలలో కూడా ఈ సీజన్‌లో అనేక జబ్బులు, అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. ఇవన్నీ కేసిఆర్ గారి ప్రసంగంలో కూడా చెప్పారు. గతంలో ఏర్పాటు చేసిన స్కీములన్నీ పేదవారికొరకు ఉపయోగించినవే కాబట్టి మేము తీసుకువచ్చిన అన్ని సంక్షేమ

కార్యక్రమాలు కొనసాగించాలని ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను. కేసిఆర్ గారు చెప్పినట్లు అవసరమైతే హెలికాప్టర్ సర్వీసును కూడా వాడుకునే పరిస్థితిని కల్పిస్తారని, వారు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాను. ఫారిన్ సర్వీసులకి సంబంధించి అనేకమంది సౌదీ అరేబియా, మొదలైన ప్రాంతాలలో ఉద్యోగార్థమై వెడుతున్నారు. కానీ, కొన్ని కారణాల వలన వారు తిరిగి ఇక్కడకు రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు కావున విదేశాంగ శాఖ ద్వారా సంప్రదింపులు జరిపి ఈ అంశంపైన కూడా దృష్టిపెట్టాలని కోరుతున్నాను. ఇంకా అనేక అంశాలున్నాయి వాటిల్లో మన స్వయం పాలన, మన నీళ్లు, మన గాలి, మన నేల అనే విధంగా అనేక రకాల వివక్షలకు గురైనవారు స్వేచ్ఛావాయువులు పీల్చుకునే విధంగా తెలంగాణా బిడ్డలందరికీ బంగారు భవిష్యత్తు ఉండాలనే విధంగా ఎన్నికలలో వాగ్దానాలు చేసిన విధంగా అన్నీ నెరవేర్చాలని నేను కోరుకుంటున్నాను. వీటికి సంబంధించి మీరు కొంత సమయం తీసుకున్నా అర్థవంతంగా, ఆరోగ్యవంతంగా చెప్పినటువంటి మాటలు నిస్సంకోచంగా, తు.చ. తప్పకుండా పాటిస్తారని ఆశిస్తున్నాను. ప్రతిపక్షంగా, ప్రజాపక్షంగా మా పాత్ర ఎలాగూ మేము పోషిస్తాము. పోలవరం ప్రాజెక్టు దగ్గర నుండి మొదలు పెట్టుకుని ఒక్కొక్క అంశాన్ని తీసుకుని ముందుకు వెడదాము. మరొక్కసారి తెలంగాణాను ఇచ్చినందుకు సోనియాగాంధీగారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. టి. ఎస్. అంటే తెలంగాణా స్టేట్ రిజిస్ట్రేషన్ నెంబరు ఈరోజు నుండి మొదలు కాబోతోంది. కానీ, నేను టి. ఎస్. అంటే తెలంగాణా స్టేట్ అని, టి.ఎస్ అంటే తెలంగాణా సోనియాగాంధీ అనుకుని తృప్తి పడుతున్నాను. ఎందుకంటే, టి.ఎస్ అనే తెలంగాణా రిజిస్ట్రేషన్ నెంబరు ఈ రోజునుంచే స్టార్ట్ అవుతోంది. కాబట్టి, తెలంగాణా రాష్ట్రం ఉన్నన్నాళ్లు సోనియాగాంధీ గారి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని నేను భగవంతుడిని కోరుకుంటున్నాను. తెలంగాణా సంస్కృతి చాలా గొప్ప సంస్కృతి. మనకి ఒకరు పెడితే, మనం ఒకరికి పెట్టాలనుకుంటాము. ఆ రకమైన అతిథి మర్యాదలతో మనం ఉంటాము. గిరిజనులకే కాకుండా ఇంకా అనేక అంశాలు గవర్నర్‌గారి ప్రసంగంలో ప్రస్తావించలేదు. అన్యమనస్కంగానే గవర్నర్‌గారికి గౌరవం ఇవ్వాలి కాబట్టి నేను మాట్లాడాను. ఇది సంపూర్ణంగా లేదు. ఎన్నికల ప్రణాళికలాగా ఉంది. కొంత డొల్లతనంగా, కొంత ఊహాత్మకంగా ఉంది. వాస్తవికతకు దగ్గరగా లేదు. కానీ తెలంగాణా రాష్ట్రానికి అంతా మంచే జరగాలని భగవంతుడిని వేడుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్, జై తెలంగాణా.

శ్రీ బి. వెంకటేశ్వర్లు (అసెంబ్లీ) : అధ్యక్షా, గవర్నర్‌గారి ప్రసంగంపైన ధన్యవాదాలు తెలియచేసేందుకు నాకు అవకాశం ఇచ్చినందుకు ముందుగా తమకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఎన్నో సంవత్సరాలనుండి తెలంగాణా రాష్ట్రం కావాలని కలలు కన్నాము.

ఆ కల సాకార దాల్చి నేడు 29వ రాష్ట్రంగా తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఈనాటి ఈ చర్చలో పాల్గొనడం ఎంతో సంతోషించదగ్గ విషయం. ఈ నేపథ్యంలో ఎంతోమంది అమరులయ్యారు. వారియొక్క స్ఫూర్తి ఆ విధంగా ఉన్నది. ఏ రకంగా తెలంగాణా ఉద్యమం రూపుదిద్దుకుందనేది మనం 1969నుండి చూస్తూనే ఉన్నాము. ఈ ఉద్యమంలో చాలామంది కవులు, కళాకారులు, న్యాయవాదులు ఒక్కరేమిటి అందరూ భాగస్వాములయ్యారు. ప్రధానంగా మన కౌన్సిల్‌లో చూస్తే, టిఆర్ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు చెందినవారందరూ తెలంగాణా ఉద్యమంలో బాహాటంగా పోరాటం చేయడం జరిగింది. కానీ, మాకు మాత్రం చాలా బాధాకరమైన సంఘటనలు కూడా జరిగాయి. చంద్రబాబు నాయుడు గారు అఖిలపక్షం ఏర్పాటు చేయమని కోరగానే కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినప్పుడు చంద్రబాబు నాయుడు గారు పాదయాత్రలో భాగంగా వరంగల్‌లో ఉన్నారు. అక్కడనుండి మాయొక్క ప్రతినిధిని పంపి మేము తెలంగాణాకు అనుకూలంగా ఉన్నామని చెప్పారు. అయన అనుకూలంగా ఒక లెటర్ ఇవ్వడం జరిగింది. ఆ విధంగా చేయడమే తెలంగాణా ఏర్పడడానికి ప్రధాన కారణమైంది.

(సభ్యులు శ్రీ వి. భూపాల్‌రెడ్డి వెప్పు నుండి అంతరాయం)

ఆ విధంగా లెటర్ ఇచ్చి కూడా మేము అవమానాలపాలైనాము. మమ్మల్ని టార్గెట్ చేశారు. ఇంకెవరికీ ఇటువంటి పరిస్థితి రాలేదు. మిగతావారందరూ అసెంబ్లీలో ఉంటే మమ్మల్ని పోలీసు స్టేషన్లో పెట్టారు. అటువంటి అవమానాలను కూడా మేము భరించాము. తెలంగాణా ఏర్పడడంలో మాయొక్క ప్రధానపాత్ర ఉందని ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను. నూతన తెలంగాణా రాష్ట్రంలో గవర్నరర్‌గారి ప్రసంగం దశ దిశ లేకుండా చాలా చప్పగా ఉన్నది. నిరాశ మిగిల్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన ప్రస్తావించలేదు. ప్రధానంగా వ్యవసాయ ఋణాలు, పోలవరం ఆర్డినెన్స్, విద్యుత్తు కోతలు, ఫీజు రీయింబర్సుమెంట్, నల్గొండ ఫ్లోరైడ్ సమస్యలపై స్పష్టత ఇవ్వలేదు. మేడిపండు చందంగా ఈ ఉపన్యాసం ఉన్నది తప్ప కొత్తదనమేమీ మాకు కనిపించలేదు. టిఆర్ఎస్ ఇచ్చిన హామీలకు గవర్నర్ ప్రసంగానికి పొంతన లేకుండా పోయింది. ఎందుకంటే, ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తరువాత ఏర్పడిన ఈ తెలంగాణా రాష్ట్రంలో గవర్నర్ ప్రసంగం కేవలం 20 నిముషాలే చదివారు. కానీ, మా సుధాకర్ అన్న దానిని ఎలాబరేట్ చేస్తూ గంటా ఇరవై నిముషాలు చెప్పారు. తెలంగాణా రైతులు ఆశించిన ఋణమాఫీపై గవర్నరుగారి ప్రసంగంలో స్పష్టత లేదు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే పేద బడుగు, బలహీన వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతాయని ఆశించాము. ఈ ప్రభుత్వం ఏర్పడి కొన్ని రోజులై అయింది. కానీ, మొట్టమొదటి స్టేట్‌మెంట్ ఋణమాఫీ అనేది కేవలం ఒక్క సంవత్సరానికే పరిమితం

కావడమనేది కొంత ఆందోళనకు దారితీసింది. ఒక్క స్టేట్‌మెంట్‌తోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కాబట్టి మొత్తం ఋణాలు మాఫీ చేయాలని కోరుతున్నాము. ఇప్పటికే 2500మంది ఆత్మబలిదానాలతో ఈ రాష్ట్రం ఏర్పడింది. ఇకపై ఆత్మహత్యలు ఉండవని అనుకున్నాము. కొద్ది రోజులలోనే మళ్లీ ఆత్మహత్యలు జరిగాయి. ఇది చాలా దురదృష్టకరం. ఈ విధంగా జరగకూడదని మేము కోరుకుంటున్నాము. మీరు ఋణాలపైన స్పష్టత ఇవ్వాలి. టిఆర్ఎస్ మ్యానిఫెస్టోలో చెప్పినవి అవి తక్షణం అమలు కావాలి. సన్న, చిన్న, పెద్దకారు రైతులు చాలా ఇబ్బందికర పరిస్థితులలో ఉన్నారు. వ్యవసాయం అంటే ఎవరికీ పట్టింపు లేదు. అందరూ హైదరాబాదు అర్బన్ ప్రాంతాలకే వస్తున్నారు. కాబట్టి ఈ విషయంలో తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఇక అమరువీరుల కుటుంబాలకు సుమారు12 లక్షల రూపాయలు ఇస్తామన్నారు చాలా సంతోషం. ఇంటికో ఉద్యోగమిస్తామన్నారు సంతోషం. కానీ, వారికి గృహవసతి కల్పించవలసిన అవసరం ఉన్నది. అలాగే, ఆయా ఇళ్లల్లో ఉన్నవారికి విద్యను పూర్తిగా చెప్పించే బాధ్యతకూడా ప్రభుత్వం తీసుకోవలసిందిగా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇంతకుముందు సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర రెడ్డి చాలా విషయాలు మాట్లాడారు. శ్రీమతి సోనియాగాంధీగారి గురించి కూడా చెప్పారు. సంతోషం. కాంగ్రెస్ పార్టీ హయాంలో భూ కుంభకోణాలు చాలా జరిగాయి. ఆ సందర్భంలో టిఆర్ఎస్ గానీ, తెలుగుదేశం పార్టీ గానీ ఇతర ప్రతిపక్షాలు పలు అభ్యంతరాలను వ్యక్తం చేయడం జరిగింది. వీటన్నింటిని వెలికి తీసి తగిన చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే, నూతన తెలంగాణా రాష్ట్రం ఏర్పడింది కాబట్టి, మొదటినుంచే భూకబ్జాలకు పాల్పడిన వారిని వెలుగులోకి తీసుకురావలసిన అవసరం ఉన్నది. ఎవరు భూకబ్జాలకు పాల్పడ్డారు అనేది చూసుకుని వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. ఆవిధంగా వాటిని వెనక్కి తీసుకుంటే బ్రహ్మాండంగా అభివృద్ధి జరుగుతుంది. వక్ఫ్ భూములను కూడా ఆవిధంగా చేయవలసిన అవసరం ఉన్నది. ఇవన్నీ చేయడం ద్వారా తప్పకుండా మన హైదరాబాదు బాగా అభివృద్ధి చెందుతుంది. ఇక విద్యుత్తు కోతలు విషయానికి వస్తే గ్రామాలలో రెండు మూడు గంటలకంటే ఎక్కువసేపు విద్యుత్తునివ్వడంలేదు. ఈ విషయమై గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా పేర్కోలేదు. ఇందిరాపార్కువద్ద ధర్నాచౌక్‌ను చూస్తే నిత్యం వివిధ పరిశ్రమలకు చెందిన ఎంతోమంది ధర్నాలు చేస్తున్నారు. ఛత్తీస్‌ఘఢ్‌నుండి విద్యుత్తు కొంటామన్నారు సంతోషం. ఆ రకంగా రైతాంగానికి వ్యవసాయానికి మేలు చేయాలి. పక్కనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో మనం పోటీ పెట్టుకోవాలి. నిజాం కాలంనుండి కూడా తెలంగాణాకు హైదరాబాదుకు బ్రాండ్ ఇమేజ్ ఉన్నది. ఆ బ్రాండ్ ఇమేజ్ తగ్గకుండా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అందుకు మేము నిర్మాణాత్మ కంగా మా పూర్తి మద్దతును తెలియచేస్తున్నాము.

చేనేత రంగం ఎంతో సంక్షోభంలో ఉన్నది. చేనేత కార్మికులు ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చేనేత కార్మికులు వ్యవసాయం చేసుకోలేరు. బీడీ కార్మికుల పరిస్థితి కూడా చాలా దయనీయంగా ఉంది. వారిని కూడా ప్రభుత్వం ఆదుకోవాలి. అయ్యా! అవినీతి అసలే ఉండదని ముఖ్యమంత్రిగారు స్టేట్‌మెంట్ ఇచ్చారు. చాలా సంతోషం. కానీ, సిమెంట్ ధర ఈ వారం లోపలే వంద రూపాయలు పెరిగింది. ఎందుకు ఈ రకంగా పెంచారు? దీనిని కంట్రోల్ చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నది. దీనివెనక ఎవరు ఉన్నారో తెలుసుకుని దానిని అరికట్టాలి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొనబోతే కొరివి అమ్మబోతే అడవిలాగా ఉన్నాయి. నేడు మార్కెట్‌కు జేబునిండా డబ్బు తీసుకువెళ్లినా సంచినిండా కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. ధరల స్థిరీకరణ చేయవలసిన అవసరం ఈ ప్రభుత్వానికి ఉన్నదని ఈ సందర్భంగా నేను తెలియచేస్తున్నాను. ఉప్పు, పప్పు, బియ్యం, నూనె ఒక్కటేమిటి అన్ని వస్తువులమీదా వ్యాట్ ప్రకటించారు. వ్యాట్ రద్దు చేసి సరసమైన ధరలకు వస్తువులు వచ్చే విధంగా పోరాటం చేయాలని కోరుతున్నాను. ఫీజు రీయింబర్సుమెంట్ విధానం మీద కూడా స్పష్టత లేదు. గత ప్రభుత్వం చేసిన విధంగానే ఫీజు రీయింబర్సుమెంట్ చేయాల్సిన అవసరం ఉన్నది.

12.40 మ. అవినీతి అసలు ఉండదని ముఖ్యమంత్రిగారు స్టేటుమెంటు ఇచ్చారు, చాలా సంతోషం. కానీ సిమెంటు ధర చూస్తే ఒక్క వారం రోజుల్లోనే వంద రూపాయలు పెరిగింది. ఏకదమ్ వంద రూపాయలు పెరిగింది. సిమెంటు ధరలు తగ్గించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఎందుకు పెంచారు, ఎలా పెంచారో విచారణ చేసి వాటి ధరలను నియంత్రించడానికి చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దీని వెనక పెద్ద లాబీయింగ్/సిండికేట్ వుంది. వాళ్లు ఎలా అనుకుంటే అలా ధరలు పెరుగుతాయి. కాబట్టి తక్షణమే సిమెంట్ ధరలను అదుపులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎక్కడ చూసినా కూడా కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి అన్న చందంగా ఉంది. జేబు నిండా డబ్బులు తీసుకుని పోతే సంచి నిండా కూరగాయలు వచ్చే పరిస్థితి కూడా లేదు. ధరల స్థిరీకరణ చేయవలసిన అవసరం ఉంది. ఈరోజు ఉప్పు, పప్పులు, బియ్యం, నూనె ధరలు పెరిగాయి. ప్రతి దాని మీద వ్యాట్ విధించారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టిఆర్‌యస్ వాళ్లు కూడా ఈ వ్యాట్‌ను వ్యతిరేకిస్తూ సభలో మాట్లాడడం జరిగింది. కాబట్టి వ్యాట్‌ను రద్దు చేసి సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులు లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి గవర్నర్‌గారి ప్రసంగంలో స్పష్టంగా చెప్పలేదు. దీనికి సంబంధించిన డ్యూస్ చాలా పెద్ద ఎత్తున ఉన్నాయి. చాలా కళాశాలలకు ఫీజులు చెల్లించవలసి ఉంది. గత ప్రభుత్వం ఏవిధంగా అమలు చేసిందో ఆవిధంగా ఫీజు రీయింబర్స్‌మెంటును పూర్తి స్థాయిలో చెల్లించవలసిన అవసరం ఉంది. కె.జి. నుంచి పి.జి. వరకు ఉచిత నిర్బంధ విద్యను అవసరమైన వారందరికీ అందిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున పత్రికల ద్వారా ప్రకటనలు చేసి ప్రజలకు తెలియజేసి ఉచిత విద్యను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

Slumless cities గురించి గవర్నర్ గారి ప్రసంగంలో చెప్పారు. హైదరాబాదును విశ్వ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాదులో చిన్న వర్షం వస్తేనే ఎక్కడ పడితే అక్కడ డివైడర్లను కట్ చేసి వర్షం నీటిని క్లియర్ చేయవలసిన పరిస్థితి ఉంది. కొంచెం వర్షం వస్తేనే కెబిఆర్ పార్క్ దగ్గర నీరంతా నిలిచిపోతుంటే డివైడర్లను కట్ చేయవలసిన పరిస్థితి వస్తోంది. ఎంతో మంది చిన్న పిల్లలు డ్రెయినేజీల్లో పడిపోయి చనిపోయిన సందర్భాలున్నాయి. కాబట్టి డ్రెయినేజీ మరమ్మత్తులను టేకప్ చేయవలసిన అవసరం వుందనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నాను.

తాగునీటి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. గ్రామాలలో గానీ, పట్టణాలలో గానీ పరిస్థితి దారుణంగా ఉంది. రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది. పరిస్థితిని మెరుగుపరచడానికి వెంటనే చర్యలు చేపట్టాలి.

రాజకీయ అవినీతిని నిర్మూలిస్తామని చెప్పడం జరిగింది, చాలా సంతోషం. ప్రభుత్వం ఏర్పడి కొన్ని రోజులే అయింది కాబట్టి వేచి చూస్తాం. ఇంతకు ముందు సుధాకర్ రెడ్డి గారు చెప్పినట్లు తెలంగాణా ప్రజలు చైతన్యవంతులయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో వారికి కూడా ధైర్యం వచ్చింది. వాళ్లు రాజకీయ అవినీతి మీద ఫిర్యాదు చేసే విషయాన్నీ సులభతరం చేయాలని కోరుతున్నాను. మన రాజధాని నగరంలో ముఠాలు నడుస్తున్నాయి, భూకబ్జా దందాలు నడుస్తున్నాయి, సెటిల్‌మెంట్లు నడుస్తున్నాయి, వీటన్నింటినీ కంట్రోల్ చేయవలసిన అవసరం ఉంది. ప్రభుత్వంలో కొంతమంది తయారై భూకబ్జాలు చేయడానికి పూనుకుంటారు కాబట్టి దీన్ని అరికట్ట వలసిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో కబ్జా చేయబడిన భూములను ప్రభుత్వం తిరిగి తీసుకోవాలి.

జలయజ్ఞం యొక్క నిజ స్వరూపం ఇప్పుడు బయటపడింది. ఎక్కడా ఒక్క ఎకరానికి కూడా నీరిచ్చిన దాఖలాలు లేవు. మోబిలైజేషన్ అడ్వాన్స్ క్రింద పెద్ద ఎత్తున డబ్బులు డ్రా చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఇదే పరిస్థితి ఉంది. జలయజ్ఞం గురించి

చాలా గొప్పలు చెప్పారు. నీళ్లొచ్చి మన రాష్ట్రమంతా సస్యశ్యామలం అవుతుంది, కొరత ఉండదు, పంటలు పండించుకోవచ్చని పెద్ద ఎత్తున ప్రచారం చేసి ఈ జలయజ్ఞంలో డబ్బులు ఖర్చు పెట్టారు. కానీ ఈరోజు చూస్తే ఎక్కడా కూడా ఒక్క ఎకరానికి నీళ్లొచ్చిన దాఖలాలు లేవు. ఈ విషయంపై టిఆర్‌యస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు మాట్లాడింది. దీంట్లో ఎన్నో కుంభకోణాలు జరిగాయి. మోబిలైజేషన్ అడ్వాన్సెస్ క్రింద పెద్ద ఎత్తున నిధులు డ్రా చేసుకుని పనులు చేయకుండా వదలి పెట్టారు. వాటి మీద విచారణ చేయాలి.

ఖనిజ దోపిడీ విపరీతంగా జరిగింది. ఆ విషయం గురించి గవర్నర్ గారి ప్రసంగంలో ఎక్కడా కూడా ప్రస్తావన లేదు. ఆ విషయంలో చర్యలు తీసుకుని ఎక్కడైతే దోపిడీ జరిగిందో ఆ డబ్బును రికవరీ చేయవలసిన అవసరం ఉంది. ఉద్యోగాలు వస్తాయని చెప్పి పెద్ద ఎత్తున యస్ఇజడ్‌లకు పర్మిషన్స్ ఇచ్చారు. కానీ చదువుకున్న యువతకి ఉద్యోగాలు మాత్రం రాలేదు. కాబట్టి వాటి విషయంలో కూడా పునరాలోచన చేయాలి. వాస్తవంగా ఉద్యోగాలు వచ్చాయా లేదా అనే విచారణ చేసి, అది అమలు కాకపోతే సంబంధిత ఎస్ఇజడ్‌లను క్యాన్సిల్ చేయాలి. కిరణ్ కుమార్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ విధంగా ఉద్యోగాలు కల్పించని వాటిపై చర్యలు తీసుకున్న సందర్భాలున్నాయి. ఆవిధంగా మీరు కూడా ఎంక్వైరీ చేసి చర్యలు తీసుకోండి.

మద్యం విషయానికి వస్తే - ప్రభుత్వానికి విపరీతంగా ఎక్కడి నుంచి ఆదాయం వస్తోందంటే దీన్ని నుంచే వస్తోంది. కేవలం ఆదాయాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకోకుండా, ప్రజల బాగోగుల గురించి దీన్ని నియంత్రించాలి. తెలంగాణాలో గిరిజన ప్రాంతం పెద్ద ఎత్తున ఉంది. కల్తీ మద్యానికి ప్రధానంగా చాలా మంది పేదవాళ్లు బలైపోతున్నారు. మద్య వినియోగాన్ని ప్రోత్సహించడం కాదు, దాన్ని కంట్రోల్ చేయవలసిన అవసరం ఉంది.

సంక్షేమం గురించి చూస్తే - యస్సీ యస్టీ సబ్‌ప్లాన్‌కి చట్టబద్ధత కల్పించే విషయాన్ని మొదట మన సభలోనే టేకప్ చేయడం జరిగింది. ఆ తర్వాత అసెంబ్లీలో టేకప్ చేశారు. యస్సీ యస్టీలకు కేటాయించిన నిధులను వేరే వాటికి మళ్లిస్తున్నారనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, వారికి కేటాయించిన నిధులను వారి కోసమే ఖర్చు చేసే విధంగా ఆ సబ్‌ప్లాన్‌కి చట్టబద్ధత తీసుకరావాలని దానికి మన కౌన్సిల్‌లో అంకురార్పణ చేశాం. ఆ తర్వాత అది చట్టం అయింది, అమల్లోకి వచ్చింది. బిసి ల సబ్‌ప్లాన్ కి సంబంధించి కూడా మనం ఈ సభలోనే యునానిమస్‌గా రిజల్యూషన్ పాస్ చేయడం జరిగింది. కానీ దురదృష్టవశాత్తు అసెంబ్లీలో దానిపై తీర్మానం పెట్టలేదు, అది అమలు కాలేదు. రాష్ట్రంలో బిసి జనాభా దాదాపు

60శాతం ఉంది. ఏవిధంగానైతే యస్సీ యస్టీలకు దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామో అదే విధంగా బిసి లకు కూడా దామాషా ప్రకారం నిధులు కేటాయించవలసిన అవసరం ఉంది. బిసి సంక్షేమానికి ఐదు సంవత్సరాలకు రూ.50వేల కోట్లు కేటాయించారు. అలా గాకుండా ఈ ఒక్క సంవత్సరానికే బిసి లకు రూ.50వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. బిసి క్రింద 93 కులాలున్నాయి. రాజశేఖర్ రెడ్డిగారి పుణ్యమా అని మరో 40 కులాలను బిసి లలో కలిపారు. దాంతో బిసి క్రింద మొత్తం 133 కులాలున్నాయి. కులాలు పెరిగినా నిధులు మాత్రం పెంచలేదు. దామాషా ప్రకారం నిధులు పెంచకపోవడం వల్ల బిసి ల పరిస్థితి దారుణంగా ఉంది. బిసి లు బయట గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. బిసి లలో సంచార జాతులు కూడా ఉన్నాయి. చాలా దుర్భరమైన పరిస్థితి ఉంది. యస్సీ యస్టీల కన్నా బిసి ల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. బిసి లలో ఏదో ఐదారు కులాల వారు ఆర్థికంగా బలంగా కనిపిస్తే అది గొప్ప కాదు. ఈరోజు రాష్ట్రంలో కొట్టచ్ఛిజుర్రీటఫీ ఛిజ్యాటఙ్చట ఉన్నాయి. గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ గారు మాట్లాడుతూ - బిసి లను అందరి కంటె మేము మంచిగా చూస్తామన్నారు. కాబట్టి యస్సీ యస్టీ సబ్‌ప్లాన్ మాదిరిగానే బిసి సబ్‌ప్లాన్ తీసుకొచ్చి, దాన్ని అమలు చేసి బిసి ల పట్ల ఉన్న కమిట్‌మెంటును ప్రూవ్ చేసుకోవలసిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉంది. తప్పనిసరిగా వచ్చే సమావేశాలలో బిసి సబ్‌ప్లాన్‌ను తీసుకొచ్చి అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం . దానికి చట్టబద్ధత కల్పిస్తే దామాషా ప్రకారం నిధులు వస్తాయి కాబట్టి ఈ 133 కులాల జీవన పరిస్థితులు మెరుగయ్యే అవకాశం ఉంటుంది, ఆమేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

వైద్యం గురించి సభ్యులు సుధాకర్ రెడ్డిగారు చెప్పారు. ప్రతి జిల్లాకి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తామని గవర్నర్‌గారి ప్రసంగంలో చెప్పారు, సంతోషం . ఆవిధంగా ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈరోజు ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కడా కూడా మందులు అందుబాటులో లేవు. మా వరంగల్ యంజియం హాస్పిటల్‌లోనే ఆక్సిజన్ లేదని చెప్పారు. ఎన్నో సందర్భాలలో ఆందోళనలు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు డెప్యూటీ సియం గా ఉన్న రాజయ్య గారు ఇక్కడ వసతులు లేవని చెప్పడం జరిగింది. నిమ్స్ లాంటి హాస్పిటల్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఈరోజు గవర్నర్‌గారి ప్రసంగంలో చెప్పారు, ఊహా చిత్రంగా, బ్రహ్మాండంగా చెప్పారు. సినిమా ఫెయిల్ కావద్దు, సినిమా సక్సెస్ కావాలి, ఈ సినిమా ఐదు సంవత్సరాలు నడవాలి. అందుకొరకు ఒక ప్రణాళిక పెట్టండి. మేము నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తాం . ఒక వంద రోజుల్లో నిర్దిష్టంగా ఈ

కార్యక్రమాలు చేస్తామని చెప్పండి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారు వంద రోజుల్లో చేసే కార్యక్రమాల గురించి చెప్పారు. మీరు కూడా వంద రోజుల్లో ఫలానా పనులు చేస్తామని చెప్పండి. ప్రభుత్వం మీద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మన ప్రభుత్వం వచ్చింది, మన తెలంగాణా వచ్చింది, మన తెలంగాణ రాష్ట్రంలో బాగు పడతామని ఆశిస్తున్నారు. ఇంటికొక ఉద్యోగం ఇస్తామని చెప్పారు, ఇస్తే సంతోషం . మనం ఎలాగైతే జూబ్లీ హాల్‌లో కూర్చుని లైట్లతో వెలిగిపోతున్నామో అలాగే తెలంగాణ ప్రజల జీవితాలలో కూడా వెలుగులు నింపాలి, ఆమేరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

బయ్యారం గనులను రక్షణ స్టీల్స్‌కి కేటాయించినపుడు టిడిపి పెద్ద ఎత్తున పోరాటం చేసి ఆ అనుమతులను రద్దు చేయించడం జరిగింది. అందులో ప్రధాన పాత్ర మాది ఉంది. ఈ ప్రభుత్వం ప్రభుత్వోద్యోగులకు అనుకూలంగా ఉంటుందని, ఉద్యోగి-స్నేహపూర్వక పరిపాలనా సంబంధం కలిగి ఉంటుందని చెప్పారు. మొన్న ముఖ్యమంత్రిగారు ఉద్యోగులతో మాట్లాడుతూ వారికి తమ ప్రభుత్వం అనుకూలంగా ఉంటుందని చెప్పారు. కాబట్టి ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ వయో పరిమితిని 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని నేను ఈసందర్భంగా కోరుతున్నాను. ప్రక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 58సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచారు. ఆ రకంగా మనం కూడా 60సంవత్సరాలకు పెంచాలని కోరుతున్నాను.

అధ్యక్షా, నిన్న గవర్నర్‌గారి ప్రసంగంలో కేవలం ఎమ్మెల్యేలు, యంపీల వసతుల విషయం మాత్రమే చెప్పారు. ఆ తర్వాత తమరి అధ్యక్షతన జరిగిన బిఏసిలో నేను ముఖ్యమంత్రి గారి ముందు ఈ అంశాన్ని ప్రస్తావించాను. గౌరవ మంత్రివర్యులు కూడా ఆ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగారు ఏమన్నారంటే - ఆవిషయంపై మీతో మాట్లాడి చెబుతామన్నారు, అయినా సంతోషమే. ఎమ్మెల్సీలకు సంబంధించిన హౌస్ అప్పర్ హౌస్. పార్లమెంటులో ఉండే లోక్‌సభ, రాజ్యసభలలో - అప్పర్ హౌస్ అయిన రాజ్యసభకే టాప్ ప్రయారిటీ ఉంది. అక్కడ వారికి రెడ్ కార్పెట్ ఉంటే ఇక్కడ మనకి కూడా రెడ్ కార్పెట్ వచ్చింది.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, కర్నాటక గవర్నమెంటులో ప్రతి కలెక్టరేటులో ఎమ్మెల్సీలకు, రాజ్యసభ సభ్యులకు అవసరమైన సిబ్బందితో ఒక పర్మనెంట్ ఆఫీసు ఉంటుంది. ఆవిధంగా మన రాష్ట్రంలో కూడా ప్రతి కలెక్టరేటులో ఒక ఆఫీసుంటే బాగుంటుంది.

ఆవిషయాన్ని పరిశీలిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. ఎమ్మెల్సీ అయినా రాజ్యసభ సభ్యులైనా ఆ కార్యాలయాన్ని ఉపయోగించుకోవచ్చు.

శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు: అధ్యక్షా, ఈరోజు మనం కేవలం 40 మంది మాత్రమే ఉన్నాం. కౌన్సిల్ 40 మందితో ఏర్పాటు కావడం చాలా సంతోషించదగ్గ విషయమే. చాలా మంది మాట్లాడుతూ తెలంగాణాకి కౌన్సిల్ రాదని అన్నారు. అయినా మనం కౌన్సిల్‌ని సాధించుకున్నాం. అయితే ఎమ్మెల్సీలకు ప్రాధాన్యత లేకుండా పోతోంది. ఈరోజు వ్యవస్థ ముఖ్యం, వ్యక్తులు ముఖ్యం కాదు. నేను మరో తొమ్మిది నెలల్లో రిటైర్ కావచ్చు, అది ముఖ్యం కాదు. గ్రాడ్యుయేట్స్, లోకల్‌బాడీస్, టీచర్స్, నామినేటెడ్ ఎమ్మెల్సీలున్నారు, 120 మంది ఎమ్మెల్యేలు, 17మంది యంపీలు, ఏడుగురు రాజ్యసభ సభ్యులున్నారు రాష్ట్రంలో. గతంలో ఎమ్మెల్సీలకు ప్రాధాన్యత ఇవ్వలేదు, ఈ తెలంగాణ రాష్ట్రంలో ఆ పరిస్థితి ఉండకూడదు. ఎమ్మెల్సీ కోటా నుంచే డెప్యూటీ సియం గారు వచ్చారు. ప్రతి చోటా ఎమ్మెల్సీలకు గౌరవం ఉండేలా చూడాలి. మొన్న బిఏసిలో ముఖ్యమంత్రిగారు కూడా అన్నారు, ప్రొటోకాల్‌లో ఎమ్మెల్యేల కంటే ఎమ్మెల్సీలకే ఎక్కువ ప్రాధాన్యత ఉండాలని. నిన్న గవర్నర్‌గారి స్పీచ్‌లో కూడా తప్పు దొర్లింది. మొదట శాసనసభ సభ్యులు అని, తర్వాత మండలి సభ్యులని చెప్పారు. సియం గారు మొన్న ఏమి చెప్పారంటే - తాను విద్యార్థిగా ఉన్న సమయంలో కౌన్సిల్‌గ్యాలరీలో కూర్చుని ప్రొసీడింగ్స్‌ను చూశానని, చర్చ సమర్థవంతగా జరిగేదని చెప్పడం జరిగింది. మొన్న అసెంబ్లీలో చర్చలు జరగలేదు గానీ కౌన్సిల్‌లో బ్రహ్మాండంగా చర్చ జరిగింది. ఆ చర్చల వల్ల యస్సీ యస్టీ సబ్‌ప్లాన్‌కి చట్టబద్ధత తెచ్చుకోగలిగాం. బిసి సబ్‌ప్లాన్‌కి సంబంధించి యునానిమస్‌గా తీర్మానం చేశాం, మీరు ఆరోజు ఛైర్‌లో ఉన్నారు. నా గొంతు పోయినా, మైక్ కట్ చేసినా మాట్లాడాను. మనం నిర్మాణాత్మకమైన చర్చలు జరిపి, ఒక మంచి సాంప్రదాయాన్ని నెలకొల్పి, కౌన్సిల్‌కి మంచి గౌరవం తీసుకొచ్చాం. రానున్న రోజుల్లో ఈ కౌన్సిల్‌కి, ఎమ్మెల్సీలకి గౌరవం ఉండాలి. పార్లమెంటులో రాజ్యసభకి ఏ ట్రీట్‌మెంటు ఉందో అదే విధంగా మన కౌన్సిల్‌కి, ఎమ్మెల్సీలకు కూడా ఉండాలి. నిన్న బిఏసి సమావేశంలో ముఖ్యమంత్రి గారు చెప్పారు, ఎమ్మెల్యేల కన్నా ఎమ్మెల్సీలకు ప్రొటోకాల్ ఎక్కువ ఉండాలన్నారు. డెప్యూటీ సియం గారు కూడా మీటింగులో ఉన్నారు. కానీ ఆవిషయాలు ఈరోజు హౌస్‌లో ఇచ్చిన నివేదికలో లేవు, అయినా ఫర్వాలేదు. ఏదేమైనా గవర్నర్‌గారి ప్రసంగం చాలా చప్పగా సాగింది. కానీ ఇంతకు ముందు మాట్లాడిన పాతూరి సుధాకర్ రెడ్డి గారి ప్రసంగం మాత్రం చాలా బ్రహ్మాండంగా సాగింది. ఆయన టీచర్స్ యూనియన్ లీడర్. నేను గతంలో మండల ప్రజాపరిషత్ ప్రెసిడెంట్‌గా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పని చేశాను.

మేమిద్దరమూ చాలా సమావేశాలకు కలిసి వెళ్లాం. ఆయన ఎక్కడికిపోతే అక్కడ స్వరం పెంచి బాగా మాట్లాడేవారు. ఈరోజు కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో చాలా బ్రహ్మాండంగా పాల్గొన్నారు. చాలా చక్కగా చెప్పారు. చాలా చేయవలసిన కార్యక్రమాలున్నాయి. ఈ ప్రభుత్వానికి పూర్తి మద్దతు తెలుపుతున్నాం . గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ కల్పిస్తామనే విషయంపై యునానిమస్‌గా మద్దతు తెలుపుతున్నాం . మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్ కల్పించడంపై మద్దతు తెలుపుతున్నాం . మీరు ఏమంచి కార్యక్రమాలు తీసుకున్నా టిడిపి తరపున మద్దతు తెలుపుతాం. కానీ పంట రుణాలకు సంబంధించి ఇచ్చిన తప్పుడు స్టేటుమెంట్ల మూలంగా కొంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అది రిపీట్ కాకూడదన్నదే మా ఆవేదన, బాధ. ఇకముందు ఆవిధంగా జరగకూడదు. మనందరమూ కూడా తెలంగాణా వాళ్లమే. తెలంగాణా రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. అందరమూ కలిసికట్టుగా పని చేద్దాం. ఇంతకు ముందు ఛైర్మన్‌గారి ఛేంబర్‌కి వెళ్లాం, అందరమూ కలిసి టీ తాగాం, మళ్లీ ఇక్కడికి వచ్చాం . ఆ రకంగానే తెలంగాణా రాష్ట్రాభివృద్ధికి కలిసి పని చేద్దాం. రాష్ట్రాభివృద్ధికి మా సలహాలు, సూచనలు తీసుకోండి. పూర్తిగా సహకరిస్తాం. ఎందుకంటే మేము కూడా చాలా పోరాటం చేశాం. 1969 నుంచీ కూడా విద్యార్థి దశలో మేము కూడా జైళ్లకు వెళ్లిన సందర్భాలున్నాయి. ప్రధానంగా శ్రీకాంతాచారి గురించి చెప్పారు. ఆయన వరంగల్ జిల్లా వాస్తవ్యులు . నా నియోజకవర్గంలో కూడా ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు చనిపోతే స్వయంగా నేను, రాజలింగం గారు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించాం. హాస్పిటల్స్‌కు వెళ్లి అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందించాం. ఎందుకు చనిపోతున్నారని అడిగితే - తెలంగాణా రాష్ట్రం వచ్చేటట్లు లేదు, అందుకే చనిపోతున్నామని వాళ్లు చెబితే మేము చలించి పోయేవారము. ఈవిధంగా ఏమీ ఆశించకుండానే రాష్ట్రం కొరకు ప్రాణాలు త్యాగం చేశారు. మా లైఫ్ ఏమైనా ఫర్వాలేదు, మా లక్ష్యం తెలంగాణ రాష్ట్రం అంటూ పోరాటం చేయడం జరిగింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సమర్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను, జైహింద్, జైతెలంగాణ.

1.00 మ. డా. కె. నాగేశ్వర్ : అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ చారిత్రిక సందర్భంలో నాకు మాట్లాడే అవకాశం ఇచ్చిన మీకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. 2007 వ సంవత్సరంలో అన్ని రాజకీయ పార్టీలను ఓడించి నేను గెలిచాను. 2009 వ సంవత్సరంలో దాదాపు చాలా పార్టీలు నాకు మద్దతునిచ్చాయి. నాకు ఇప్పటికీ గుర్తు ఉంది. ఆనాడు టి.ఆర్.ఎస్ అధ్యక్షుడిగా మాత్రమే ఉన్న శ్రీ కె. చంద్రశేఖర రావు గారు ఒక రోజు నాకు ఫోన్ చేసి ప్రొఫెసర్ గారూ.. మీకు మద్దతు ఇవ్వాలని మేము

నిర్ణయించామని చెప్పారు. సర్, మీరు మద్దతు ఇస్తానన్నారు కాని, పోటీ చేయాలని ఇంకా నేను నిర్ణయించుకోలేదని అన్నాను. లేదు సార్. తెలంగాణ రాష్ట్రం రాబోతుంది. పునర్నిర్మాణంలో మీ భాగస్వామ్యం ఉండాలి. మీరు తప్పకుండా పోటీ చేయాలని అన్నారు. నేను పోటీ చేయాలని అలా అంటున్నారని అప్పుడు అనుకున్నాను. కాని, 5 సంవత్సరాల తరువాత అది నిజమైంది. నేను ఇంకా 9 నెలలు మాత్రమే శాసన పరిషత్ సభ్యునిగా ఉంటాను. కచ్చితంగా, ఈ 9 నెలల సమయంలో తెలంగాణ రాష్ట్ర నవ నిర్మాణం కొరకు సాధ్యమైనంత మేరకు నా పాత్ర ఉంటుంది. ఆ అవకాశం కూడా మీరు ఇస్తారని ఆశిస్తూ, ఇవ్వాలని కోరుకుంటున్నాను.

అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది కనుక ఒక దార్శినిక ప్రణాళిక ఉండాలని కోరుకుంటున్నాను. Vision for Telangana. వచ్చే 5 సంవత్సరాలు ఈ తెలంగాణ ప్రభుత్వానికే కాదు, తెలంగాణ పౌర సమాజానికీ, ఈ రాజకీయ వ్యవస్థకు కూడా ఒక ప్లాన్ ఉండాలి. ఒక perspective planను తయారు చేయడానికి ఒక స్పెషల్ తెలంగాణ లెజిస్లేచర్ సెషన్‌ను ఏర్పాటుచేయాలని నా విజ్ఞప్తి. దానిని ఒక 10, 15 రోజులలోనే ఏర్పాటు చేయండి. వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, ఎంప్లాయ్‌మెంట్, విద్య ఇలా ఒక్కొక్క రంగాన్ని తీసుకొని నవ తెలంగాణ నిర్మాణంలో ఈ రంగాలు ఏ విధంగా ఉండాలనే దాని గురించి లోతుగా చర్చిద్దాం. ప్రతి సభ్యునికీ కొంత సమయం ఇవ్వండి. లిఖిత పూర్వకంగా నివేదికలతో రమ్మనమనండి. ఈ ఉభయ సభల నుండి నవ తెలంగాణ సమాజ నిర్మాణం కోసం ఒక దార్శినిక ప్రణాళిక ఉండాలి. మనం కూడా రోటీన్‌గా as usual business ప్రకారం ఉంటే లాభం లేదు. ఎందుకంటే. తెలంగాణ రాష్ట్రం కోటి ఆకాంక్షలతో ఏర్పడింది. ఈ ఆకాంక్షలను తీర్చగలిగితే తెలంగాణ సమాజం సంతోషపడుతుంది. ఒకవేళ ఈ ఆకాంక్షలను తీర్చడంలో ఈ రాజకీయ వ్యవస్థ విఫలమైతే తెలంగాణ ప్రాంతంలో తీవ్రమైన అశాంతి కూడా చెలరేగే ప్రమాదం ఉంది. భారత రాజ్యాంగాన్ని దేశ ప్రజలకు అంకితం చేస్తూ, డా. బి.ఆర్. అంబేద్కర్ గారు ఆనాడు ఒక మాట అన్నారు. అతి కష్టం మీద నిర్మించుకున్న ఈ రాజకీయ వ్యవస్థను మనం ప్రజలకు ఇస్తున్నాము. ఈ రాజ్యాంగం ఆ రకమైన పొలిటికల్ స్ట్రక్చర్‌ను ఈ దేశ ప్రజలకు ఇస్తుంది. ఆ ప్రజల ఆకాంక్షలను కనుక ఈ పొలిటికల్ స్ట్రక్చర్ తీర్చలేకపోతే ఎంతో కష్టంతో మనం నిర్మించుకున్న ఈ రాజకీయ వ్యవస్థను ఆ ప్రజలే చిదిమి వేస్తారు, చెరిపి వేస్తారని అన్నారు. They will tear the Political structure a part which we have assiduously built-up. అందువల్ల, అంబేద్కర్ గారు రాజ్యాంగాన్ని ఈ దేశానికి ఇస్తూ చేసిన హెచ్చరిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ సమాజానికి,

చట్ట సభలకు కూడా ఒక హెచ్చరికగా ఉండాలి. అందువల్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తీర్చే విధంగా నవ తెలంగాణ నిర్మాణానికి ఒక దార్శనిక ప్రణాళికను ఈ చట్ట సభలు రూపొందించాలి. అందువల్ల బడ్జెట్ సమావేశాలతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా మరొక సమావేశాన్ని పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. రోజంతా కూర్చుందాం. ఒక్కొక్క రంగాన్ని పరిశోధించి విశ్లేషిద్దాం. ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను రూపొందించుకుందాం. తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి కావాలో ప్రజలకు వివరిద్దాం. ఇది నా మొదటి విజ్ఞప్తి.

రెండవది, గవర్నర్ గారి ప్రసంగంలో కొన్ని అంశాలు ప్రస్తావించారు. వాటిని తప్పని సరిగా మనం నెరవేర్చాలి. తెలంగాణలో ఉన్న అతి మౌలికమైన సమస్య ఏమిటి? తెలంగాణ ఉద్యమానికి మూల కారణం నీరు, నిధులు, ఉద్యోగాలు. తెలంగాణ లో ఉన్న గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరిస్తామని గవర్నర్ ప్రసంగంలో చెప్పారు. నేను నిజంగా దీనిని స్వాగతిస్తున్నాను. ఎందుకంటే... Centre for Public Policy and Governance, Administrative Staff College of India జరిపిన ఒక పరిశోధన Economic and Political Weeklyలో ఒక వ్యాసంగా ప్రచురితమైంది. దానిలోచెప్పిందేమిటంటే.. 1956 నుండి 2009 సంవత్సరాల మధ్య కాలంలో తెలంగాణ ప్రాంతంలో మూడు లక్షల హెక్టార్ల భూమి చెరువుల క్రింద సాగు విస్తీర్ణం అదృశ్యమైంది. ఇది సుమారు 59 శాతం. Irrigation pattern in Telangana in the last 60 years చూస్తే, మనకు కొట్ట వచ్చినట్లు కనపడేదేమిటంటే... కెనాల్ ఇరిగేషన్ నైన్టీస్ వరకు పెరుగుతూ వచ్చింది. నైన్టీస్‌లో పడిపోయింది. తరవాత కొద్దిగా పెరిగింది. అలా హెచ్చుతగ్గులకు లోనవుతూ వస్తుంది.

కాని, ఇరిగేషన్‌లో రెండు అంశాలలో consistency ఉంది. ఒకటి, చెరువుల క్రింద సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోతూ వచ్చింది. బావుల క్రింద, బోరు బావుల క్రింద వ్యవసాయం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఇదే తెలంగాణ పాలిట శాపమైంది. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం రంగం పైన, రైతుల ఆత్మహత్యలపై ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయతి ఘోష్ కమిటీ కూడా ఇదే విషయాన్ని చెప్పింది. ఎప్పుడైతే, చెరువులు విధ్వంసానికి గురయ్యాయో అప్పుడు భూగర్భ జలాలపై మనం విపరీతంగా ఆధారపడుతూ వచ్చాం. అందుకే ఈరోజు తెలంగాణలో అత్యధికంగా పంపుసెట్లు ఉన్నాయి. తెలంగాణలో వ్యవసాయం unpredictable గా మారింది. తెలంగాణ వ్యవసాయం under-developedగా మారింది. Un-stableగా మారింది. అందువల్ల చెరువుల పునరుద్ధరణ

చాలా మంచి కార్యక్రమం. 1960వ సంవత్సరంలో National Commission for Applied Economic Research (NCAER) techno economic analysis చేసి తెలంగాణ ప్రాంతంలో భూగర్భ జలాల వినియోగాన్ని ఆపండని చెప్పింది. దురదృష్టం ఏమిటంటే.. ఈ 50 సంవత్సరాలలో తెలంగాణలో భూగర్భ జలాల వినియోగాన్ని ఆపకపోగా అత్యధికంగా వినియోగం చేశాం. ఈరోజు పరిస్థితి ఏమిటి? భూ, జల స్థరాల నుండి రీ-జనరేటింగ్ కెపాసిటీ నీరు పునరుత్పత్తి అయ్యే సామర్థ్యాన్ని మించి మనం వాడుకుంటున్నాం. అందువల్ల ఈ రోజు ఒక ecological disaster తెలంగాణను వెక్కిరిస్తోంది. అందువల్ల చెరువుల పునరుద్ధరణను కచ్చితంగా ఆహ్వానించాలి. అయితే, ఇది కేవలం నినాదంగా కాకుండా దీనికి ఒక కార్యాచరణ ప్రణాళికను పెట్టండి. రాబోయే 6 నెలల కాలంలో ఎన్ని చెరువులను పునరుద్ధరిస్తారో, తరువాత 6 నెలల కాలంలో ఎన్ని చెరువులను పునరుద్ధరిస్తారో ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని పెట్టుకొని చెరువుల పునరుద్ధరణను చేపట్టాలి. దీనిని మనం ఆహ్వానించాలి.

గవర్నరు గారి ప్రసంగంలో ఒక్క చెరువులనే కాదు అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. చాలా సంతోషం. కాని, గతంలో మనకు రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ అనుభవం ఉంది. 86 ప్రాజెక్టులు, లక్ష కోట్ల రూపాయలు, రెండు లక్షల ఎకరాలు. ఇలా చెప్పుకుంటూపోయారు. ఆచరణలో జరిగింది ఏమిటి? 86 ప్రాజెక్టులకు మోబిలైజేషన్ అడ్వాన్సులు మాత్రం వచ్చాయి కానీ, నీరు మాత్రం మోబిలైజ్ కాలేదు. ఆ పరిస్థితి తెలంగాణలో మరల రాకుండా ఉండాలంటే.. నిర్దిష్టంగా ఒక ప్రేయార్టీ ప్లాన్ ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉండాలి. ఇందులో మొదటిది, దుర్భిక్ష ప్రాంతాలలో, కరవు పీడిత ప్రాంతాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి కరవు పీడిత ప్రాంతాలలో ఉన్నటువంటి నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టండి. మొదటి దశలో వీటిని ప్రకటించి చేపట్టండి. అలాగే, ఇప్పటికీ నీటిపారుదల సామర్థ్యం అతి తక్కువగా ఉన్న జిల్లాలు ఉన్నాయి. ఆనాటి ఇరిగేషన్ శాఖ మంత్రి శ్రీ పొన్నాల లక్ష్మయ్య గారు శాసనమండలికి ఇచ్చిన లెక్కలలోనే మహబూబ్‌నగర్ జిల్లాలో 14 శాతం ఇరిగేషన్ ఉందని, రంగారెడ్డి జిల్లాలో 9 శాతం ఇరిగేషన్ ఉందని చెప్పారు. ఇలా అతి తక్కువ ఇరిగేషన్ సామర్థ్యం ఉన్న జిల్లాలపైన, ప్రాంతాలపైన దృష్టిని కేంద్రీకరించి అక్కడ నీటి వనరుల కల్పన కొరకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. మూడవది, రూ.20 కోట్లు, 30 కోట్లు, 50 కోట్లు ఖర్చు పెడితే పూర్తయ్యే ప్రాజెక్టులున్నాయి. ఆదిలాబాద్‌లో అనేక మైనర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయి. వీటికి ఒక 50 కోట్లు వరకు ఖర్చు పెడితే పూర్తవుతాయి. అతి తక్కువ ఖర్చుతో అత్యధిక లాభాలను ఇచ్చేటటువంటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి దృష్టిని కేంద్రీకరించండి.

నాల్గవ దశలో భారీ ప్రాజెక్టుల మీద ఖర్చు పెట్టండి. ఈ విధంగా నాలుగు దశలుగా ఇరిగేషన్ ప్లాన్‌ను చేపట్టండి. మొత్తం పెండింగ్ ప్రాజెక్టులన్నీ సత్వరం చేస్తామంటే అచరణలో సాధ్యమయ్యే పని కాదు. కంట్రాక్టర్లకు అనుచిత ప్రయోజనం కలుగుతుంది తప్ప ప్రజలకు ఏమీ ప్రయోజనం చేకూరదు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రాధాన్యత లోపించడం వల్ల ఆ నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.12,000కోట్లు నష్టపోయిందనీ, కాంట్రాక్టర్లకు అనుచిత ప్రయోజనం కలిగిందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌వారి నివేదికలో చెప్పారు. నేనేమి ఏ రాజకీయ నాయకుని ఉపన్యాసం నుండి వీటిని ఉటంకించడం లేదు. మరల ఇటువంటి తప్పులు తెలంగాణలో పునరావృతం కాకూడదని చెప్పి ప్రాధాన్యతల క్రమాన్ని రూపొందించుకోవాలని కోరుతున్నాను. గవర్నర్ ప్రసంగంలో కూడా దీనిని చేర్చాలనేది నా విజ్ఞప్తి. అలాగే, పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని అమలు చేస్తామని మీరు చెప్పారు. చాలా సంతోషం. కాని, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు మాత్రమే జాతీయ ప్రాజెక్టు హోదా కోసం ప్రయత్నిస్తామని చెప్పారు.

కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ గారు మహబూబ్‌నగర్‌లో జరిగిన ఒక సమావేశంలో మా ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టబోతుంది. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని జాతీయ పథకంగా చేపడతామన్నారు. అందుకే, రాష్ట్ర ముఖ్యమంత్రి గారిని కోరేదేమిటంటే.. సుష్మా స్వరాజ్ గారి దగ్గరకు వెళ్లండి. అక్కడ నుండి వారిని తీసుకొని కేంద్ర మంత్రి ఉమా భారతి గారి దగ్గరకు వెళ్లండి. అమ్మా నీ అక్క చెప్పింది. పాలమూరు ప్రజలకు మాట ఇచ్చింది. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించమని చెప్పండి. ఆ విధంగా చేస్తే తెలంగాణ రాష్ట్రంలో మరొక జాతీయ ప్రాజెక్టు రావడానికి అవకాశం ఉంది. అలాగే జూరాలా- పాకాల గ్రావిటీ ప్రాజెక్టు అన్నారు. చాలా సంతోషం. తెలంగాణలో ఉన్న అతి పెద్ద గ్రావిటీ ప్రాజెక్టు శ్రీరాంసాగర్. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును దాదాపు 18 లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు మొదలు పెట్టారు. ఈరోజు పూడిక వల్ల 10 లక్షల ఎకరాలకు తగ్గి పోయింది. ఇంకా తగ్గి పోవడానికి అవకాశం ఉంది. దానిని రెస్టోర్ చేయండి. అందువల్ల ఈ ప్రాజెక్టును ఆహ్వానిస్తున్నాం. కాని, హైదరాబాద్‌లో నివసిస్తున్న ప్రజానీకానికి అవసరమైన మంచినీటి అవసరాలను తీర్చడానికి గోదావరి నదీ జలాలను తీసుకువచ్చే ప్రాజెక్టు ఒకటి ఉంది. గవర్నరు గారి ప్రసంగంలో దీని గురించి ప్రస్తావన లేదు. దయచేసి, దీని గురించి ఆలోచించండి. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టారు. హైదరాబాద్‌కు కేవలం కృష్ణా నది జలాలు మాత్రమే సరిపోవు. మనకు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లలో ఉన్నటువంటి నీరు సరిపోదు. కృష్ణా మూడు దశలను అమలు చేసినా కూడా ఇంకా 300 ఎం.జి.డిల పైగా

కొరత ఉంది. అందువల్ల అతి దగ్గరగా కాళేశ్వరం దిగువన 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాంతానపల్లిలో ప్రాణహిత, ఇంద్రావతి ఉపనదులు గోదావరిలో కలిసిన తరువాత పుష్కలంగా నీరు ఉంటుంది. అక్కడి నుండి ఏటూరు నాగారం-ములుగు-ఆలేరు మీదుగా హైదరాబాద్‌కు గోదావరి నీటిని తీసుకువస్తే కేవలం 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌కు పుష్కలంగా నీరు అందించవచ్చు. ఈ గోదావరి నదీ జలాల ప్రాజెక్టును తక్షణం చేపట్టడండి. గోదావరి నదీ జలాలు తీసుకురాకుండా హైదరాబాద్‌కు మంచి నీటి అవసరాలు శాశ్వతంగా తీర్చడం సాధ్యం కాదు. నేను మిగతా ప్రాజెక్టులను వద్దనడం లేదు. కృష్ణా మూడవ దశను పూర్తి చేయవద్దని అనడం లేదు. వాటితోపాటు ఈ గోదావరి నదీ జలాల ప్రాజెక్టును కూడా చేర్చండి. ఆ రకంగా ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. తెలంగాణ ఏర్పడింది కేవలం రాజకీయ, భౌగోళిక స్వరూపం మాత్రమే. దీనిని ఒక సస్యశ్యామల తెలంగాణగా చేయగలిగితే నిజంగా తెలంగాణ ప్రజలు ఆనంద పడతారు. ఆ దార్శనిక ప్రణాళిక ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉండాలని కోరుకుంటున్నాను.

**రెండవది, తెలంగాణ పారిశ్రామికీకరణ :**

మనందరికీ తెలుసు. తెలంగాణ ఖనిజాల గని. భారతదేశంలో ఉన్న మొత్తం బొగ్గు నిక్షేపాలలో దాదాపు 20 శాతం తెలంగాణలో ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అటవీ సంపదలో దాదాపు 45 శాతం తెలంగాణలో ఉంది. తెలంగాణలో ఉన్న ఖనిజ నిక్షేపాలు బొగ్గు, మాంగనీసు, చైనా క్లే, స్ఫటికం, సున్నపురాయి అఖరికి యురేనియం కూడా ఉంది. ఇలాంటి విలువైన ఖనిజ నిక్షేపాలున్నాయి. ఇలాంటి విలువైన ఖనిజ నిక్షేపాలను అక్రమ మైనింగ్‌కు పాల్పడకుండా జాగ్రత్త పడితే తెలంగాణ పారిశ్రామికీకరణకు మనం బాటలు వేయవచ్చు. ఆ రకమైన అవకాశం ఉంది. పరిశ్రమలను పునరుద్ధరించండి. దీనికి కీలమైనది విద్యుత్తు. విద్యుత్ రంగం గురించి గవర్నర్ గారి ప్రసంగంలో చెప్పారు. ఆహ్వానిస్తున్నాను. కాని, తెలంగాణ ఉద్యమ సమయంలో పదే, పదే ఒక మాట చెప్పారు. హుస్సేన్‌సాగర్ థర్మల్ పవర్ ప్లాంటు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉంది. దీనిని కూలగొట్టి ఐమాక్స్ థియేటర్‌ను కట్టుకున్నాం. బహుశా నాగకరికతలో ఇటువంటి పనులు ఎవరూ చేయరు. ఐమాక్స్ థియేటర్‌ను కట్టడమనేది సంతోషమే. నేనేమి దానిని వద్దనడం లేదు. కాని, ఐమాక్స్ థియేటర్‌ను కట్టుకున్న తరువాత కూడా హుస్సేన్‌సాగర్ థర్మల్‌ప్లాంటును రెస్టోర్ చేసుకోలేదు. అందువల్ల తెలంగాణ ఉద్యమం అస్థిత్వ ఉద్యమం అయినప్పుడు, ఆత్మగౌరవ ఉద్యమం అయినప్పుడు దానికి ప్రతీకగా ఉండే ఉదాహరణ హుస్సేన్‌సాగర్ థర్మల్‌ప్లాంటు. దీనిని కచ్చితంగా రెస్టోర్ చేయాలి. హైదరాబాద్‌లోని కోటి మంది ప్రజానీకానికి విద్యుత్ అవసరాలను

తీర్చడానికి ఒక డెడికేటేడ్ పవర్ ప్లాంటుగా దీనిని ఏర్పాటు చేయాలి. కరీంనగర్ జిల్లాలోని నేదునూరు, శంకరపల్లి పవర్ ప్రాజెక్టుల గురించి ఈ సభలో చాలా సార్లు మాట్లాడుకున్నాం. ఆ ప్రాజెక్టుల ప్రారంభానికి అన్ని క్లియరెన్స్‌లు సిద్ధంగా ఉన్నాయి. ఫ్యూయల్ లింకేజ్ లేక ఆగిపోయాయి. అందువల్ల విద్యుత్తు రంగంలో ఉన్న లోటును మనం అధిగమించలేకపోతే నవ తెలంగాణను, పారిశ్రామిక తెలంగాణను ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. అందువల్ల రాబోయే మూడు సంవత్సరాలలో ఒక మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రంగా తెలంగాణను రూపుదిద్దుకోవాలి కాబట్టి దీనిపై దృష్టిని కేంద్రీకరించమని విజ్ఞప్తి చేస్తున్నాను.

నాల్గవది వ్యవసాయం. ఇంతకు ముందు పెద్దలు చెప్పినట్లు, గవర్నర్ గారి ప్రసంగంలో చెప్పినట్లు... తెలంగాణలో ఇరిగేషన్‌తో పాటు జిల్లాల వారీగా వ్యవసాయ సమస్యలున్నాయి. నిజామబాద్‌లో పసుపు, చెరకు గురించి ప్రస్తావన వచ్చింది. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పండుతుంది. అక్కడ జిన్నింగ్ మిల్లులు ఉంటాయి కాని, స్పిన్నింగ్ మిల్లులు ఉండవు. రంగారెడ్డి జిల్లాలో కంది పండుతుంది. నల్గొండ, వరంగల్ జిల్లాలలో మిర్చి, పసుపు, పొగాకు లాంటి పంటలు పండుతాయి. ఈరోజు బోధన్‌లో ఉల్లి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా నిర్దిష్టంగా ఆయా ప్రాంతాలలో ఉన్నటువంటి పంటలను గుర్తించి వ్యవసాయ అవసరాలకు ఒక ప్రణాళికను రూపొందించమని కోరుతున్నాను. హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి జిల్లాలో ఒకప్పుడు కూరగాయలు, పూలు, పండ్లు విపరీతంగా పండించే వారు. ఈరోజు రియల్ ఎస్టేట్ వ్యాపారం వచ్చి అవి అదృశ్యమైపోయాయి. గతంలో ఈ సభలో స్పెషల్ హార్టీకల్చర్ జోన్ ఒకటి కావాలని కోరితే అప్పటి ముఖ్యమంత్రి గారు ప్రకటించారు కాని, ఇంతవరకు అది రూపుదాల్చలేదు. హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి జిల్లాలో రైతాంగ భాగస్వామ్యంతో స్పెషల్ హార్టీకల్చర్ జోన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పండ్లు, కూరగాయలు పండించి వీటిని రైతు బజార్లతో, మొబైల్ రైతు బజార్లతో, మినీ రైతు బజార్లతో లింకప్ చేయగలిగితే అటు రైతులు లాభపడతారు. ఇటు ప్రజలు లాభ పడతారు. ధరలు కూడా తగ్గించవచ్చు. ఈ ఆలోచన చేయవలసిందిగా కె.సీ.ఆర్ గారి నాయకత్వంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఐదవది, పర్యాటక రంగం : దీని గురించి గవర్నర్ గారి ప్రసంగంలో ప్రస్తావన లేదు. తెలంగాణలోని హైదరాబాద్‌లో మెడికల్ టూరిజం ఉంది. నాగార్జునసాగర్ మొదలుకొని బుద్దిస్ట్ సర్క్యూట్స్ ఉన్నాయి. జైన, బౌద్ధ సాంప్రదాయాలకు ఇది పురిటి గడ్డ. అధ్యక్షా, నాకు ఆశ్చర్యం కలుగుతుంది. నేను చిన్నప్పుడు గుంటూరు జిల్లాలోని అమరావతి గురించి చదువుకున్నాను. మనందరం చదువుకున్నాము. కాని, మా ఊరి ప్రక్కన ఉన్న కోటిలింగాల

గురించి చదువుకోలేదు. కోటిలింగాల అనేది శాతవాహనుల తొలి రాజధాని. దాని గురించి మనం చదువుకోలేదు. మనం ఎక్కడో జరిగిన మన్యం విప్లవం గురించి చదువుకున్నాం. అది అవసరమే. నేను కాదనడం లేదు. అల్లూరి సీతారామరాజు అంటే అందరికీ గౌరవమే. వీరపాణ్యా కట్ట బ్రహ్మన్న గురించి చదువుకున్నాం కాని మా ఊరి ప్రక్కన ఉన్న జోడేఘాట్ గురించి చదువుకోలేదు. అందువల్ల తెలంగాణ ఉద్యమం పదే, పదే ప్రజల ముందు పెట్టింది ఏమిటంటే.. తెలంగాణ చరిత్ర, సంస్కృతులకు సరైన ప్రాధాన్యత లభించలేదని చెప్పారు. ఇవ్వాళ ఈ గవర్నర్ ప్రసంగంలో దాని గురించి ప్రస్తావన లేకపోవడం కొంత ఆవేదన కలిగించింది. అందువల్ల తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అటు ఉపాధి అవకాశాలను పెంపొందించవచ్చు, తెలంగాణ చారిత్రిక విశిష్టతను , తెలంగాణ చారిత్రిక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి అవకాశం ఉంటుంది. ఆ ప్రస్తావనను గవర్నర్ ప్రసంగంలో చేర్చాలన్నది మా కోరిక.

ఆరవది, అనేక అంశాలు తెలంగాణ ఉద్యమంలో చెప్పారు. సీమాంధ్ర పెట్టుబడుదారుల దోపిడీ గురించి చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. సీమాంధ్ర పెట్టుబడుదారులను తొలగించి తెలంగాణ పెట్టుబడుదారుల దోపిడీని మాత్రం తీసుకురావద్దని కోరుతున్నాను. దోపిడీదారుడు ఏ ప్రాంతం వారైనా కొంపమునుగుతుంది. కత్తితో కోయాలనుకున్నప్పుడు అది ఏ ప్రాంతం కత్తి అయినా ఒకటే. ఈ సభలోనే మనం కొట్లాడాము. రాజీవ్ రహదారిలో జరిగిన అక్రమాల గురించి ఇక్కడ కొట్లాడాము. భానుప్రసాద్ గారి నాయకత్వంలో ఒక కమిటీని వేశారు. ఆ కమిటీలో అందరం సభ్యులుగా ఉన్నాము. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఏమైందో ఇప్పటికీ మాకెవరికి తెలియదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమైనా దానిని బయటకు తీయాలి. రాజీవ్ రహదారి తెలంగాణకు ఒక దారిలాంటిది అధ్యక్షా. తెలంగాణకు ఒక కంఠమాల లాంటిది. అలాంటి రహదారి నిర్మాణంలో అన్యాయాలు, అక్రమాలు జరిగాయని చెప్పాం. అక్రమాలు జరిగాయో, లేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి. గత రాష్ట్ర ప్రభుత్వానికంటే inhibitions ఉండవచ్చు. ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి inhibitions అవసరం లేదు. దానిని ఈ ప్రభుత్వం బయట పెట్టాలి. హైదరాబాద్‌లో బొటానికల్ గార్డెన్స్‌ను కబ్జా చేసే ప్రయత్నం జరిగింది. నిజామాబాద్‌లో సహకార చక్కెర కర్మాగారం మూతపడింది. ఇలాంటివంటి వాటిని గుర్తించి, ఉద్యమ కాలంలో ఏ అంశాలనైతే ఉద్యమ ఆయుధాలుగా మలచుకున్నారో వాటిని ఈరోజు పరిష్కరించాల్సిన బాధ్యత కొత్త రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఆ రకంగా ఆలోచించాలని కోరుతున్నాను.

ఏడవది, విద్యా రంగం. అధ్యక్షా, నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 130 పట్టణాలు తిరిగి ఉపన్యాసాలు ఇచ్చాను. మీరు ఎక్కడి నుండి వచ్చారని చాలా చోట్ల నన్ను అడిగేవారు. నేను ఆదిలాబాద్ జిల్లా వాసినని చెప్పితే నిజంగా మీరు తెలంగాణకు చెందిన వారేనా అని అడిగే వారు. ఎందుకు అలా అంటున్నారని అడిగితే మీరు అంత బాగా మాట్లాడుతున్నారు కాబట్టి నిజంగా మీది తెలంగాణయేనా? అప్పుడు ఆవేదన కలిగేది. తెలంగాణ వాళ్లకు మాట్లాడడం చేతకాదా? నాకు నిజంగా ఉత్తర తెలంగాణ దాటితే బంధువులు కూడా ఎవరూ లేరు. మా తాతల పది తరాలు చూసినా అంతా తెలంగాణలోనే ఉన్నారు. అటు ఎవరూ లేరు. అందువల్ల తెలంగాణ విజ్ఞాన తెలంగాణగా ఉండాలి. కె.జి నుండి పి.జీ వరకు ఫ్రీ అండ్ కంప్లసరీ ఎడ్యుకేషన్ అని అన్నారు.

1.20 మ. అధ్యక్షా, నాకు వీటికిపైన కొంత క్లారిటీ కావాలి. ప్రభుత్వం వెప్పు నుండి ఎల్‌కెజీ నుంచి పీ.జి వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నాణ్యమైన విద్యను ఏ విధంగా ప్రొవైడ్ చేస్తారు? ఆశ్రమ పాఠశాలలను ఏ విధంగా అభివృద్ధి చేస్తారు? తెలంగాణాలో మంచి ప్రమాణాలతో, నాణ్యతతో కూడిన విద్యను అందించగలగాలి. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా అన్ని ప్రమాణాలు కలిగిన ఒక వరల్డ్ క్లాస్ యూనివర్శిటీగా రూపొందించాలి. గతంలో డా. వై.యస్. రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను వెళ్లి సార్ ఎన్ఐడి గురించి తమరు కాస్త ప్రయత్నిస్తే హైదరాబాదుకు వచ్చే అవకాశం ఉన్నది అని చెప్పినప్పుడు అయన 24 గంటలలో కేంద్రప్రభుత్వం వారికి ఒక లేఖ వ్రాశారు. ఆ కారణాల వల్ల రూ.300కోట్ల విలువ చేసే ఎన్.ఐ.డి.ని హైదరాబాదుకు తీసుకురావడం జరిగింది. ఇప్పుడు ఆ ఎన్ఐడిని తరలిస్తామని ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికీ ఆ ఎన్ఐటి బోర్డు ఇక్కడే ఉంది. ఆ ఎన్ఐటిని తరలిస్తామని చెప్పి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పెట్టారు. దానిని తరలించకండి. హైదరాబాదులో ఐఐఎమ్ పెట్టడానికి ఫైల్ అంతా క్లియర్ అయింది. కానీ, దానిని ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించలేదు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గొప్ప గొప్ప విశ్వవిద్యాలయాలను సంప్రదించి తెలంగాణా బిడ్డలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించండి. విద్యాపరంగా ముందుకు వెళ్లిన రోజున తెలంగాణా అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను. కాబట్టి, ఆ విధంగా నాలెడ్జ్, టెక్నాలజీతో తెలంగాణా రాష్ట్రాన్ని విజ్ఞాన అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దండి.

తెలంగాణా ఉద్యమానికి మరో ముఖ్యకారణం ఉద్యోగాలు. ఈ ఉద్యోగాలలో ప్రజలకు అన్యాయం జరిగిందని అంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల గురించి గవర్నరుగారి ప్రసంగంలో చెప్పారు, చాలా సంతోషం. కానీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, పాలమూరు

విశ్వవిద్యాలయం ఇంకా ఇతర విశ్వవిద్యాలయంలో ముఖ్యంగా యువత తెలంగాణా ఉద్యమంలో విస్తృతంగా పాల్గొనడానికి ముఖ్య కారణం ఏమిటంటే - తెలంగాణా రాష్ట్రం వస్తే ప్రభుత్వ కొలువుల జాతర ఉంటుందని ఆశపడ్డారు. కానీ, ఈ ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో లేదు. ప్రభుత్వ కొలువులకు సంబంధించి వేలల్లో ఖాళీలు ఉన్నాయని అన్నారు గానీ, వాటి ప్రస్తావన గవర్నర్‌గారి ప్రసంగంలో లేదు. యుపియస్సీ తరహాలో ఖచ్చితంగా ఒక టైం టేబుల్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేయవలసిన అవసరం ఉన్నది. అనేకమంది తెలంగాణా ప్రాంతంలోని నిరుద్యోగ యువతలోని నిరాశే వారిని తెలంగాణా ఉద్యమ శ్రేణులుగా మార్చింది. కాబట్టి దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే, ఈ యువతే పోరాటశ్రేణులుగా మారడానికి అవకాశం ఉంది. కనుక ఈ సమస్యను కూడా తక్షణమే పరిష్కరించవలసిన అవసరం ఎంతైనా ఉందనేది నా అభిప్రాయం.

అలాగే, ముఖ్యమంత్రిగారు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇందిరా పార్కు వద్ద నేను నిరాహార దీక్ష చేస్తే ఈనాటి ఆర్థిక మంత్రి శ్రీ ఈటెల రాజేంద్రగారు తదితరులు నాకు పూలదండవేసి రాబోయేది తెలంగాణా ప్రభుత్వం కాబట్టి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. గవర్నరుగారి ప్రసంగంలో ఈ ప్రస్తావన ఉంటుందని మేము ఆశించాము. కానీ, గవర్నర్ ప్రసంగంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రస్తావన లేనే లేదు. శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిగారికి ఈ సమస్యలేవీ తెలియనివి కావు. కానీ, లక్షలాది ఉద్యోగులు ఈ విషయమై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అదే విధంగా ఏపియస్ఆర్‌టిసి విషయమై నేను గతంలో కూడా అనేకసార్లు చెప్పాను. ప్రైవేటు బస్సులన్నీ సీమాంధ్ర పెట్టుబడిదారులవే. ప్రైవేటు బస్సుల వలన రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ నష్టపోతోంది. కాబట్టి వాటిని నియంత్రిస్తే ఆర్‌టిసికి లాభాలు చేకూరుతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు రెండువేల కోట్ల రూపాయలను నష్టపోయాము. 29 శాతం ఆదాయం కోల్పోతున్నాము.

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం వచ్చింది. ప్రైవేటు బస్సులను నడిపే యాజమాన్యాలను ఎందుకు ఉపేక్షిస్తున్నారు? వాళ్లను ఎందుకు నిషేధించడం లేదు? అక్రమ ప్రైవేటు రోడ్డు రవాణాను ఆపండి. తెలంగాణా రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేయండి. లేనిపక్షంలో ఉద్యమ కాలంలో చేసిన హామీలను నీరుగార్చినట్లు అవుతుంది. కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించి నిర్దిష్ట హామీలను ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, తదితర అంశాలకు

సంబంధించి హామీలు ఇచ్చారు సంతోషమే. కానీ గవర్నర్ ప్రసంగంలో వ్యవసాయ కార్మికుల గురించి, అసంఘటిత కార్మికుల గురించి అసలు ప్రసావనే లేదు. ప్రతిఒక్కరికీ భూమిని ఇస్తామని మాట ఇచ్చారు. నేను చెప్పే మాటలలో ఏవైనా పొరపాట్లు ఉంటే, పెద్దలు సరిచేయండి. తమరు ప్రతి ఒక్కరికీ భూమి ఇస్తామని అన్నారు. మీరు మూడు ఎకరాల భూమి ఇస్తామని అన్నారు. నేడు కోట్లాదిగా ఉన్న వ్యవసాయ కార్మికులలో అత్యధికులు అణగారిన వర్గాలు. ఈ వర్గాలకు ఆర్థిక సాధికారత కావాలంటే భూమినివ్వడమే ఒకే ఒక్క సహజవనరు అని నేను భావిస్తున్నాను. తెలంగాణా రాష్ట్రంలో అనేక వామపక్ష ఉద్యమాలు నడిచాయి. మావోయిస్టు ఉద్యమాలు నడిచాయి. దానివెనకాల ఉన్న అతి ముఖ్యమైన సమస్య అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలే. 80వ దశకంలో శ్రీమతి ఇందిరాగాంధీగారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నక్సలైట్ ప్రాంతాలను పర్యటించి ఒక నివేదికనివ్వమని ఆనాటి ప్లానింగ్ కమీషన్‌ను కోరగా, ఆనాటి ప్లానింగ్ కమీషన్ సెక్రటరీ వెళ్లి వచ్చి వారు ఆ సమస్యలన్నింటికి మూలకారణం భూ సమస్య అని తేల్చి చెప్పారు.

వీటికి సంబంధించి అన్ని కమీషన్లు కూడా ల్యాండ్ సమస్యే అని చెప్పాయి. తమరు వీటిని ఏ విధంగా పరిష్కరిస్తారు? అణగారిన వర్గాలకు ఏ విధంగా సాధికారతనిస్తారు? అదేవిధంగా తెలంగాణా ప్రాంతంలోని జోగినీ వ్యవస్థ విషయంలో మనం సిగ్గుతో తలదించుకోవాలి. మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు మూడువేల మంది జోగినీలు ఉన్నారు. నవ తెలంగాణాలో జోగినీ వ్యవస్థను ఖచ్చితంగా నిషేధించాలి. నవ తెలంగాణాలో బాల కార్మిక వ్యవస్థ ఉండకూడదు. ఇవన్నీ మన ఆత్మగౌరవానికి సంబంధించిన అంశాలు. ఈ సామాజిక సమస్యలను మనం ఆర్థిక సాధికారతతో సాధించినప్పుడు మాత్రమే సామాజిక ఆర్థిక పునర్నిర్మాణ రాష్ట్రంగా మనం ముందుకు వెళ్లగలము.

సీమాంధ్ర ప్రాంతంలో అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం జనాభాలో గిరిజనులు సుమారు 5.3 శాతం మాత్రమే ఉన్నారు. కానీ తెలంగాణా రాష్ట్ర జనాభాలో సుమారు 9.3 శాతం వరకూ ఉన్నారు. అవశేష ఆంధ్రప్రదేశ్ మొత్తం జనాభాలో 6.9 శాతం ముస్లీంలు ఉంటే, తెలంగాణా రాష్ట్ర జనాభాలో వారి శాతం సుమారు 12.5శాతంగా ఉంది. అలాగే ఆంధ్రప్రాంతంలో ఎస్సీలు 17 శాతం ఉండగా, తెలంగాణాలో 15 శాతం వరకూ ఉన్నారు. తెలంగాణా ప్రాంతంలో అత్యంత అణగారిన ఎస్సీలు ఎక్కువగా ఉన్నారు. ఈ సామాజిక స్వభావాన్ని గుర్తించి సామాజిక మార్పులను ఆర్థిక మార్పులను మేలవించడం ద్వారానే తెలంగాణా సోషల్ స్ట్రక్చర్‌లో మనం ఒక విప్లవాత్మకమైన మార్పుని తీసుకురాగలము.

తెలంగాణా వచ్చింది రాజకీయ నాయకుల కోసం కాదు అణగారిన వర్గాల జీవితాలలో మంచి మార్పుతీసుకురావడమనే సత్యాన్ని మనం ప్రజలలోకి పంపాలి. తెలంగాణా సామాజిక విప్లవానికి ప్రభుత్వము, పౌరవ్యవస్థ, రాజకీయ వ్యవస్థలు ఏకత్రాటిపై సమాయత్తమవుదాము. తెలంగాణా ఉద్యమానికి ఆ స్ట్రైకింగ్ పవర్ వచ్చిందంటే, ఈ సామాజిక వర్గాలను మనం మరచిపోకూడదు. అందువల్ల సామాజిక వర్గాలకు మనం సామాజిక సాధికారత కల్పించేందుకు చేయూతనివ్వాలి.

నేడు తెలంగాణాలో ప్రాంతీయ అసమానతలు ఉన్నాయి. హరిత విప్లవం దక్షిణ కోస్తాలో జరిగింది. హరిత విప్లవం నీరున్న చోట జరిగింది. దానివలన వెనుకబడిన ప్రాంతాలు ఇంకా వెనుకబడ్డాయి. తెలంగాణాలో వివక్ష కొనసాగింది. కానీ, నేడు ఇంకా కొన్ని జిల్లాలలో వివక్ష కొనసాగుతున్నది. కొన్నాళ్ల తరువాత ఆ జిల్లాల వారు బయటకు వచ్చి తెలంగాణా రాష్ట్రంలో మాకు అన్యాయం జరుగుతున్నది, మేము వివక్షకు గురవుతున్నామని రోడ్డు మీదకు వచ్చే ప్రమాదమున్నది. కాబట్టి, రాజకీయ నాయకులుగా వారికి ఆ అవకాశం ఇవ్వకూడదంటే దూరదృష్టితో మనం నేటినుండే ఒక అవగాహనతో పనిచేయాలి. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ ఒక నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో స్పష్టంగా తెలంగాణాలోగల ప్రాంతీయ అసమానతలను ఎత్తి చూపింది.

అలాగే మహిళా సాధికారతకు సంబంధించి నల్గొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ మొదలైన ప్రాంతాలు ఇంకా వెనుకబడి ఉన్నాయి. అంటే, తెలంగాణా ప్రాంతంలో ఉన్న ప్రాంతీయ అసమానతలు, సాంఘిక అసమానతలను కూడా గుర్తించి, వాటికి ప్రణాళికాబద్ధమైన కృషి చేయాలి. మన రాష్ట్రంలో ఒక ప్లానింగ్ బోర్డును ఏర్పాటు చేసి, దానికి ఒక సాధికారికతను కల్పించాలి. పరిపాలనలో మంచి మార్పులు రాకపోతే, ప్రజల సమస్యలను పరిష్కరించలేము. ఈరోజున మనకు సామర్థ్యంలో ఎటువంటి కొరత లేదు. అలాగే, అంతరిక్షానికి సంబంధించిన రాకెట్లలో ఉపయోగించే కొన్ని పరికరాలు మన హైదరాబాదు నగరంలోనే తయారయ్యాయి. కొన్ని రాష్ట్రాలలో ప్రత్యేక స్టేటస్‌ను ఏ విధంగా కల్పించారో, అదేవిధంగా తెలంగాణా రాష్ట్రానికి కూడా ప్రత్యేక స్టేటస్ కల్పించాలి.

అలాగే ఆంధ్రప్రదేశ్‌కి కూడా స్పెషల్ స్టేటస్ రావాలని పొరుగు రాష్ట్రం బాగుపడాలని కోరుకుంటున్నాము. కానీ, అదేసమయంలో మన తెలంగాణా రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ రాకపోతే, ఇక్కడి పరిస్థితి ఏమిటో ఒకసారి ఆలోచించండి. గవర్నరుగారి ప్రసంగంలో అసలు

ఇటువంటి అంశాలకు సంబంధించి ఎటువంటి ప్రస్తావన లేదు. ముఖ్యమంత్రిగారు కూడా పై అంశాలకు సంబంధించిన అంశాలపైన వివరణ ఇవ్వాలి. లేకపోతే ఈ తెలంగాణాలో పరిశ్రమలు కూడా మాయమయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. కాబట్టి, వీటిపైన ప్రభుత్వం మరొకసారి ఆలోచించాలని కోరుతున్నాను. అలాగే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయి. కానీ, మనం ఐటిఐఆర్ ప్రాజెక్టులో గుర్తుంచుకోవలసిన అంశాలు ఏమిటంటే, నిజంగా మన హైదరాబాదులో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసుకోవాలంటే దానికి ఎంప్లాయ్‌మెంట్ కూడా మన దగ్గర ఉండదు. ఈ రోజు మన హైదరాబాదులో ఇంజనీరింగ్ కళాశాలలు ఎక్కువగా ఉన్నాయి. వాటిల్లో ఉన్న విద్యావిధానాన్ని సమూలాగ్రంగా మార్చవలసినవసరం ఎంతైనా ఉంది. మన ఇంజనీరింగ్ విద్యావిధానాన్ని పరిశ్రమలకు అనుగుణంగా మార్చాలి. ఎందుకంటే మనకు ఐటిఐఆర్ ప్రాజెక్టులు వస్తే, అప్పుడు తెలంగాణా బిడ్డలకు అందులో ఉద్యోగాలు రాకపోతే, అప్పుడు మళ్ళీ రాష్ట్రంలో అశాంతి వచ్చే ప్రమాదం ఉంటుంది. కాబట్టి, అటువంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఇప్పటినుంచే ఒక యాక్షన్ ప్లాన్‌తో సరైన చర్యలు చేపట్టి, వాటిని అమలుచేయవలసినవసరం ఎంతైనా ఉంది. లేకపోతే అవకాశాలు రాకుండా పోతాయి కాబట్టి ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించాలని తమ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

మన తెలంగాణా రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల కొరత ఉంది. ఇది ఎందుకు ఉండాలి? గతంలో మన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఐఏఎస్ అధికారులుగా వచ్చేవారు. ఈనాడు అటువంటి పరిస్థితి కొరవడుతోంది. తెలంగాణా బిడ్డలను అత్యున్నతస్థాయి అధికారులుగా తీర్చిదిద్దడానికి మీరు చేస్తున్న ప్రయత్నంలో మా వంతు సహాయసహకారాలు కూడా అందిస్తాము. రాబోయే ఐదు సంవత్సరాలలో దాదాపు 200 మంది విద్యార్థులను ఐఏఎస్ అధికారులుగా తీర్చిదిద్దుదాము. అందువల్ల మనకున్నటువంటి హ్యూమన్ రిసోర్సెస్‌ను, మిగిలిన సౌకర్యాలను వాడుకుందాము. మనకున్న విశ్వవిద్యాలయాలను క్వాలిటీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్లుగా మలచుకుందాము. మీరు నిర్దిష్టంగా తెలంగాణా రాజకీయ భవిష్యత్తుకు సంబంధించి సరైన ఆలోచనలు చెయ్యండి. తెలంగాణా ప్రాంత అభివృద్ధికొరకు అన్ని అంశాలను స్టడీ చేసి వాటిని అమలుచేయండి.

మన హైదరాబాదులో డిఆర్‌డిఓ ద్వారా అగ్ని మిస్సైల్‌ను ఐదు ఏళ్లలో తయారు చేయమంటే కేవలం నాలుగు ఏళ్లలోనే తయారు చేసి ఇచ్చారు. అందువలన తెలంగాణాలో ఉన్న విద్యావిధానంలో మార్పులు చేయవలసినవసరం ఉంది. అదేవిధంగా తెలంగాణాలో ఉన్న వివిధ శాఖలను సమన్వయపరచి మార్పులు చేయవలసినవసరం ఎంతైనా ఉంది. అలాగే

మరొక అంశం ఏమిటంటే, నల్లమల అడవుల నుంచి మహబూబ్ నగర్ జిల్లా ఆర్థికాభివృద్ధికి ఏ రకంగా ఉపయోగించుకోవచ్చో దాని మీద ఒక అధ్యయనం చేసి, అమలుచేయవలసినవసరం ఉంది. సరైన ప్రణాళికలు లేకుండా ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదు కాబట్టి, మన తెలంగాణా సివిలైజ్డ్‌గా అభివృద్ధి చెందాలంటే, మనకున్న వనరులను, సౌకర్యాలను ఏరకంగా ఉపయోగించుకోవాలో తగినవిధంగా ఆలోచించి సరైన ప్రణాళికలతో వాటిని అమలుచేయండి. ఇటువంటి అనేక అంశాలు మన ముందరే ఉన్నాయి. అందువలన మన తెలంగాణాను నవ తెలంగాణాగా, సస్యశ్యామలంగా, ప్రజా తెలంగాణాగా నా తెలంగాణా కోటి రతనాల వీణగా ఆకాంక్షిస్తూ, ఆ రకమైన దిశలో ఈ రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రతి పనికీ మేము సహకరిస్తాము. ప్రతి అంశంలో భాగస్వాములం అవుతాము. మీరు నాకు ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

MR.CHAIRMAN: Now I adjourn the House to meet again tomorrow at 10.00 a.m.

(The House then adjourned at 1.41 p.m. to meet again at 10.00 a.m. on Friday, the 13th June, 2014)

* * *

**"Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad."**